


'సోమశిల'కు కొనసాగుతున్న వరద

అనంతసాగరం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి శనివారం 13,036 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగింది. డ్యాంలో 72.537 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. పవర్ టన్నెల్ ద్వారా డెల్టాకు 2,650, ఉత్తర కాలువకు 250, కండలేరుకు 10,200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

7



శ్రీ పొట్టిశ్రీరాములు

నెల్లూరు

జిల్లా వార్తలు

ఆదివారం 28 సెప్టెంబరు 2025



లోకరక్షిణీ నమోస్తుతే!

* వేడుకగా నవరాత్రి ఉత్సవాలు
* వివిధ అలంకరణల్లో అమ్మవార్ల దర్శనం

జిల్లాలో దేవీ నవరాత్రి ఉత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. ఆరో రోజు శనివారం వివిధ అలంకరణలలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. నవావరణ పూజలు, కన్యపూజలు, శ్రీలలితా కుంకుమార్చన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంభహారతి తదితర పూజలు జరిగాయి. నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారు గజలక్ష్మిగాను, ఇరగాళమ్మ త్రిపురభైరవిగాను, మూలస్థానేశ్వర ఆలయంలో భువనేశ్వరి అమ్మవారు రాజరాజేశ్వరిగాను, కన్యకాపరమేశ్వరి గాయత్రి అలంకరణలో దర్శనం ఇచ్చారు. అలాగే వేదగిరి, పెంచలకోన, జొన్నవాడ క్షేత్రాల్లోనూ అమ్మవార్ల అలంకరణ ఆకట్టుకుంది. భక్తులు ఆలయాలకు పోటెత్తారు.

నెల్లూరు : త్రిపురభైరవిగా ఇరగాళమ్మ



పూజలో పాల్గొన్న భక్తులు



జీఎస్టీ 2.0ను సద్వినియోగం చేసుకోండి

* అవగాహన ర్యాలీలో జేసీ వెంకటేశ్వర్లు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ 2.0ను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎం. వెంకటేశ్వర్లు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి గాంధీబొమ్మ వరకు జరిగిన జీఎస్టీ అవగాహన ర్యాలీలో వాణిజ్య పన్నుల శాఖ అధికారులతో కలిసి జేసీ పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ ఫలాలను ప్రజలు, వ్యాపార వేత్తలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర వస్తువుల ధరలు, వైద్యానికి అవసరమైన మందుల ధరలు తగ్గాయన్నారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



3వ విడత 34 గ్రామాల్లో

వచ్చే నెల 3న రీ సర్వే ప్రారంభం

పక్కాగా నిర్వహణకు అధికారుల విస్తృత ఏర్పాట్లు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ భూముల హద్దులు, విస్తీర్ణం పక్కాగా ఉండాలని కోరుకుంటారు. కానీ, ప్రతి గ్రామంలో భూ సమస్యలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. గత ప్రభుత్వంలో జరిగిన భూముల రీసర్వేపై అనేక అభ్యంతరాలు తలెత్తాయి. కానీ వీటికి పరిష్కారం మాత్రం అప్పటి పాలకులు చూపలేదు. అయితే, ప్రస్తుత ప్రభుత్వం గతంలో జరిగిన రీసర్వే సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించింది. రీసర్వే సమస్యలపై 8,218 ఫిర్యాదుల అందాయి. వీటిలో సర్వేకు సంబంధించి 3,421, రెవెన్యూకు సంబంధించి 4,797 ఫిర్యాదులు అందాయి. జిల్లా సర్వే శాఖ అధికారులు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, విస్తీర్ణంలో సమస్యలు, ఇతర భూసమస్యలను దాదాపుగా పరిష్కరించారు. కొన్నింటిని ఎందుకు పరిష్కరించలేక పోయామో ఫిర్యాదు దారులకు తెలియచేశారు. జిల్లాలోని మిగిలిన గ్రామాల్లో ప్రస్తుత ప్రభుత్వం పక్కాగా సర్వే చేయించి, రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను అందజేస్తోంది. ఈ దశగా జిల్లాలో భూముల రీసర్వే కార్యక్రమం తొలుత పైలెట్ ప్రాజెక్టుగా ప్రాంభమైంది.



భూములు సర్వే చేస్తున్న అధికారులు

35 గ్రామా లు, రెండో విడతలో 32 గ్రామాల్లో రీసర్వే ప్రారంభమవగా, 13 గ్రామాల్లో సంపూర్ణంగా జరిగింది. మిగిలిన గ్రామాల్లో అక్టోబరు 15లోగా పూర్తిచేయనున్నారు.

* 3 నుంచి 34 గ్రామాల్లో..

జిల్లావ్యాప్తంగా 34 గ్రామాల్లో అక్టోబరు 3వ తేదీన మూడో విడత భూముల రీసర్వేను పక్కాగా ప్రారంభించనున్నారు. జిల్లాలోని 4 రెవెన్యూ డివిజన్ల పరిధిలో 38 మండలాలు ఉన్నాయి. వీటిలో 737 గ్రామాలు ఉన్నాయి. 24,08,354.98 ఎకరాల భూమి ఉంది. 737 గ్రామాలకుగాను 730 గ్రామాలలో రీసర్వే పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ గ్రామాల్లో తొలి విడతగా డ్రోన్ సర్వే పూర్తి చేశారు. ఇప్పటికే 329 గ్రామాల్లో 13వ నోటిఫికేషన్‌ను భూములకు సంబంధించి విడుదల చేశారు. ఇంకా 328 గ్రామాల్లో జిల్లాలో రీసర్వే జరగాల్సి ఉంది. ఈ సర్వేను పక్కాగా ఎలాంటి అభ్యంతరాలు లేకుండా జరిపించడానికి చర్యలు చేపట్టారు.

పక్కాగా రీసర్వే చేయిస్తాం

ఎలాంటి అభ్యంతరాలు లేకుండా భూసర్వే కార్యక్రమాన్ని చేపట్టాం. ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సమగ్ర, ఖచ్చితత్వ సర్వేకు ఆదేశాలు జారీ చేసింది. అక్టోబరు 3 నుంచి మూడో విడత రీసర్వే ప్రారంభిస్తాం. వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తాం. రైతుల అభ్యంతరాలు స్వీకరించి అప్పటికప్పుడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాం.

- నాగశేఖర్, డిప్యూటీ డైరెక్టర్, సర్వే-భూ రికార్డుల శాఖ

ఎంత ధాన్యమైనా కొంటాం

* జిల్లాలో 54 కొనుగోలు కేంద్రాలు
* పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ అర్జున రావు

ఇంటర్వ్యూ...

ఎడగారు సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని ఎంతైనా కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ అర్జున రావు స్పష్టం చేశారు. రైతు సమస్యలు పరిష్కరించడానికి, జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా అర్జునరావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.



? ఎడగారులో వరి సాగు విస్తీర్ణం ఎంత

! ఈ సీజన్‌లో 1.98 లక్షల ఎకరాల్లో వరి సాగవగా, ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు లెక్క గట్టారు.

? కొనుగోలు కేంద్రాల మాటేమిటి

! ఎడగారు ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ప్రస్తుతం పంట చేతికొచ్చిన ప్రాంతాలలో 54 కొనుగోలు కేంద్రాలను తక్షణం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం. తొలుత కోవూరు, ఆత్మకూరు, సర్వేపల్లి, కావలి తదితర ప్రాంతాలలో పంట చేతికంది విక్రయానికి సిద్ధంగా ఉన్నట్లు గుర్తించాం. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం సేకరిస్తాం.

? దళారుల బెడద ఎక్కువయ్యిందట

! రైతులను మోసం చేస్తున్న దళారుల విషయం తెలిస్తే తక్షణ చర్యలు తీసుకుంటాం. వారిపై కేసులు నమోదు చేయిస్తాం. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల ఇకపై రైతులు దళారులను నమ్మాల్సిన పని లేదు. ధాన్యాన్ని విక్రయించుకోడానికి రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలి.

? మద్దతు ధర ఎంత ఇస్తున్నారు

! గ్రేడ్-ఏ రకానికి క్వింటాల్‌కు రూ.2,389, సాధారణ రకానికి రూ.2,369 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించింది. పుట్టికి గ్రేడ్-ఏ రకానికి రూ. 20,306.50, సాధారణ రకానికి రూ.20,136.50 మద్దతు ధర ఇస్తున్నాం.

? కంట్రోల్ రూం ఏర్పాటు చేశారా?

! ధాన్యం అమ్మకాలలో ఇబ్బందులు తలెత్తితే 8520879979 నెంబరుతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం.

? మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీలు ఇచ్చారా

! ధాన్యం సేకరణ కోసం 61 మంది మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీలు స్వీకరించాం. ఇచ్చిన మిల్లులకే ధాన్యం పంపే ఏర్పాట్లు చేశాం. ఈ మిల్లులకు, కొనుగోలు కేంద్రాలను ట్యాగ్ చేశాం. కేంద్రంలో ట్రక్ షీట్ జనరేట్ కాగానే మిల్లుకు ధాన్యం వెళ్లే ఏర్పాట్లు చేశాం. రైతులకు ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాం.

- నెల్లూరు (హరనాథపురం, ఆంధ్రజ్యోతి)

ఆక్వా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రాయితీ అందిస్తోంది. యూనిట్ ధర కేవలం రూ.1.50 మాత్రమే. అయితే ఈ రాయితీ అందాలంటే సాగుదారులు తమ చెరువులకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. దీనిపై అవగాహన కల్పించేందుకు మత్స్య శాఖ అధికారులు నెల రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని స్వచ్ఛందంగా కోస్టల్ ఆక్వా అథారిటీ (సీఏఏ), ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

అప్పుడే విద్యుత్‌లో రాయితీ

జిల్లాలో 39,590 ఎకరాల్లో సాగు..

రిజిస్ట్రేషన్ అయ్యింది 14,075 ఎకరాలకే

ఆక్వాకు రిజిస్ట్రేషన్

తప్పనిసరి!



జిల్లాలో మత్స్య శాఖ లెక్కల ప్రకారం 39,590 ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతోంది. ఇందులో 1,802 ఎకరాల్లో ఉప్పునీరు, 21,538 ఎకరాల్లో మంచినీటి ఆక్వా సాగు జరుగుతోంది. అనధికారికంగా మరో 5వేల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతున్నట్లు అంచనా. ఇప్పటివరకు 14,075 ఎకరాలకు మాత్రమే రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇంకా 25,515 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉంది. ఇందులో మంచినీటి ఆక్వా సాగు చేస్తున్న రైతులు అప్సడా వద్ద, ఉప్పునీటి ఆక్వా సాగు చేస్తున్న రైతులు సీఏఏ వద్ద రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉంటుంది.

* అక్టోబరు 16 వరకు ప్రత్యేక డ్రైవ్

జిల్లాలో రొయ్యల చెరువులకు రిజిస్ట్రేషన్ చేయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించింది. మత్స్య శాఖ ఆధ్వర్యంలో నెల రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేసింది. సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16వ తేదీ వరకు నెల రోజులపాటు ఈ కార్యక్రమం చేపట్టింది. రైతు సేవా కేంద్రాల్లో ఉంటున్న గ్రామ మత్స్య సహాయకులు ఆయా గ్రామాల్లో ఉంటున్న ఆక్వా రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తులు చేయిస్తున్నారు. వీటిని మత్స్య శాఖ అధికారులు పరిశీలించి లైసెన్సులు జారీ చేస్తారు. డీకేటీ, అసైన్డ్ భూముల్లో రొయ్యలు సాగు చేస్తున్న రైతులకు తహసీల్దారు కార్యాలయం నుంచి దరఖాస్తులు వస్తే పరిశీలించి వారికి సాగు ధ్రువీకరణ పత్రాలను మత్స్య శాఖ అధికారులు అందిస్తారు.

* ఐదేళ్లపాటు లైసెన్సు

రొయ్యల సాగు చేస్తున్న రైతులు, సీఏఏ, అప్సడా నుంచి అనుమతులు తీసుకోవాలి. ఐదేళ్లపాటు లైసెన్సు ఇస్తారు. గడువు ముగిసిన తరువాత తిరిగి రెన్యువల్ చేసుకోవాలి. గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు చాలా మంది తిరిగి రెన్యువల్ చేయించుకోలేదని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాన్ ఆక్వా జోన్ పరిధిలో లేని రొయ్యల చెరువులకు విద్యుత్ రాయితీ ఇవ్వలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వం నాన్ ఆక్వా జోన్ పరిధిలో ఉన్న చెరువులకు రాయితీ విద్యుత్ అందిస్తామని ఇప్పటికే ప్రకటించింది. అయితే తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించాలని స్పష్టం చేసింది. గత ప్రభుత్వంలో యూనిట్ ధర రూ.6 నుంచి 8 వరకు ఉండేదని ప్రస్తుతం రూ.4.80 ఉందని ఆక్వా రైతులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

విద్యుత్ రాయితీని పొందాలంటే రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జిల్లాలో 12,734 మంది రైతులు 25,515 ఎకరాలకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. డీకేటీ, అసైన్డ్ భూముల్లో సాగు చేస్తున్న రైతులు రూ.500, పట్టా భూమిలో సాగు చేస్తున్న రైతులు రూ.1000 చెల్లించాల్సి ఉంటుంది.

-కే.శాంతి, మత్స్య శాఖ జేడీ



సౌత్‌మోపూరు జడ్పీ స్కూల్ ఆవరణలో ఆరబెట్టిన ధాన్యం

వరుణ దేవా.. వర్షించకు..!

బంగాళఖాతంలో ఏర్పడిన వరుస అల్పపీడనాలతో వాతావరణంలో మార్పులు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. అక్కడక్కడ వర్షాలు కురుస్తుండటంతో రైతులు వరుణ దేవా.. వర్షాలు వద్దయ్యా.. అంటూ ప్రాధేయపడు తున్నారు. ప్రస్తుతం ఎడగారు సీజన్ ముగింపు దశకు చేరుకుని వరికోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. పల్లెల్లో రైతులు, రైతు కూలీలు క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం చేతికందుతున్న ఈ సమయంలో వరుణదేవా... వద్దంటూ అన్నదాతలు కోరుతున్నారు. రోడ్లు, ఖాళీ స్థలాలు, పాఠశాల మైదానాల్లో ధాన్యం ఆరబెట్టి విక్రయానికి పెడుతున్నారు.

- నెల్లూరురూరల్, ఆంధ్రజ్యోతి)



సచివాలయంలో మద్యం సేవించి మత్తులో పడుకుని ఉన్న వీఆర్వో రంతుల్లా

సచివాలయంలో తప్పతాగి!

* పడమటినాయుడుపల్లి వీఆర్వో నిర్వాకం

ఈయన పేరు రంతుల్లా. మర్రిపాడు మండలం పడమటి నాయుడుపల్లి వీఆర్వో. మరి ఎందుకు అర్ధనగ్నంగా పడుకుని ఉన్నాడని అనుకుంటున్నారా!?. పూటుగా మద్యం సేవించిన ఆయన ఇదిగో ఇలా తాను పని చేస్తున్న కార్యాలయంలోనే నేలపై మత్తులో నిద్రలోకి జారుకున్నారు. ఈ దృశ్యాలన్నీ సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పడమటి నాయుడుపల్లి వీఆర్వో రంతుల్లా శుక్రవారం రాత్రి సచివాలయంలో పూటుగా మద్యం సేవించాడు. అక్కడ నుంచి రాలేని స్థితిలో చొక్కా విప్పేసి నేలపై దొర్లాడుతూ మత్తులోకి జారుకున్నాడు. శనివారం ఉదయం సచివాలయ తలుపులు తెరిచి ఉండటంతో కొంతమంది గ్రామస్థులు లోపలకు వెళ్లారు. అక్కడ అర్ధనగ్నంగా పడుకొని ఉన్న వీఆర్వోను చూసి అవాక్కయ్యారు. ఆ వీడియోలు సామాజిక మాధ్యమాల్లోకి పోస్టు చేయడంతో వైరల్‌గా మారాయి. కాగా, మండలంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో కొంతమంది అధికారులు, సిబ్బంది మద్యం సేవించి విధులకు హాజరవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

- మర్రిపాడు, (ఆంధ్రజ్యోతి)

కొత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పండ్ల పంపిణీ

ఇందుకూరుపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో శనివారం బీజేపీ మండలాధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో సేవా పక్షోత్సవాలలో భాగంగా రామకృష్ణ మిషన్ సహాయ సహకారంతో సామాజిక ఆరోగ్య కేంద్రానికి దుప్పట్లు, రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. రామకృష్ణ మిషన్ సభ్యులు ఎస్ శ్రీనివాసులు రెడ్డి, పీ రాం భూపాల్‌రెడ్డి, టీ లక్ష్మీనారాయణరావు, డాక్టర్ సునీల్‌కుమార్, చేవూరు వెంకట్రావు, నెల్లూరు శ్రీనివాసులు, లలితమ్మ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10902
వెండి కిలో ధర	రూ. 147500
వెండి ఒక గ్రాము	రూ. 150.50

షెల్టర్ ఉన్నచోట బస్సులు ఆగవు!

● నిరుపయోగంగా బస్‌షెల్టర్లు

వెంకటాచలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : బస్సు ప్రయాణమే సురక్షితమంటూ తరచూ స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహించే ఆర్టీసీ. దానికి అనుగుణంగా ప్రయాణీకులకు కల్పించాల్సిన సౌకర్యాల విషయంలో మాత్రం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. బస్సులు ఆగే చోట షెల్టర్లు కనిపించవు. అవసరం లేని చోట మాత్రం వీటిని నిర్మించారు. ముఖ్యంగా జాతీయ రహదారిపై మాత్రం అందుకు భిన్నంగా నిర్మాణం చేయడంతో బస్ షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. 2003కు ముందు జాతీయ రహదారిపై ఉన్న అన్ని గ్రామాల కూడళ్లలో బస్సు షెల్టర్లు ఉండేవి. రహదారి విస్తరణలో భాగంగా వాటిని తొలగించారు. కానీ గ్రామాల కూడళ్లలో వాటిని తిరిగి నిర్మించకుండా దూరంగా ఏర్పాటు చేశారు. మండలంలోని చెముడుగుంట, గొలగమూడి క్రాస్ రోడ్డు, వెంకటాచలం, ఎర్రగుంట తదితర చోట్ల ఏర్పాటు చేయగా ఒక్క చోట కూడా గ్రామ కూడలిలో ప్రయాణీకులు నిలబడే చోట ఏర్పాటు చేయలేదు. 200 నుంచి 300 మీటర్ల దూరంలోనే నిర్మించారు. దీంతో ప్రయాణీకులు అంతదూరం వెళ్లలేక కూడళ్ల వద్దే ఉండి వాహనాలు ఎక్కి వెళ్తున్నారు. ప్రయాణీకులు లేకపోవడంతో ఆయా షెల్టర్ల వద్ద బస్సులు కూడా ఆపడం లేదు.



కసుమూరు రోడ్డు వద్ద నిరుపయోగంగా ఉన్న బస్‌షెల్టర్

బస్సు షెల్టర్లు లేక ప్రయాణికుల అవస్థలు

రోడ్డు పక్కన బస్సు కోసం నిరీక్షించే వారి కోసం అవసరమైన చోట బస్సు షెల్టర్లను నిర్మిస్తే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది. అన్ని రహదారుల పక్కన ఆయా పంచాయతీల వారు షెల్టర్లను నిర్మిస్తారు. అయితే జాతీయ రహదారి పక్కన మాత్రం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉంది. బస్సు షెల్టర్లు లేక ఎండకు, వానకు నిలడలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాకుటూరు గ్రామంతోపాటు వెంకటా చలంలోని సర్వేపల్లి రోడ్డు కూడలిలో అసలు షెల్టర్లే ఏర్పాటు చేయలేదు. దీంతో ప్రయాణీకులు ఎండావానలో ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి చోట్ల ఆర్టీసీ అధికారులైనా షెల్టర్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా వారు కూడా పట్టించుకోవడం లేదు. సర్వేపల్లి, కసుమూరు ప్రాంత ప్రజలకు ఇది కూడలి కావడంతో నిత్యం నెల్లూరు, గూడూరు వైపు వందలాది మంది ప్రయాణీకులు ఇక్కడ బస్సుల కోసం నిరీక్షిస్తుంటారు. ఇక్కడ బస్సు షెల్టర్లను నిర్మించకపోవడం పట్ల ప్రయాణీకుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అలాగే గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద బస్సు షెల్టర్ ఉన్నప్పటికీ అది నిరుపయోగంగా మారింది. దానిని ఉపయోగంలోకి తెచ్చినట్లయితే ప్రయాణీకులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అధికారులు ఇకనైనా ఆ దిశగా వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



14 చెరువులు సర్వే చేస్తున్నాం

●అనురూప్, సర్వేయర్, మనుబోలు

మనుబోలు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో 14 చిన్న, మధ్య తరహా చెరువులను గ్రామాల్లో నీటిసంఘాల ఫిర్యాదు మేరకు రీ సర్వే చేస్తున్నట్లు మండల సర్వేయర్ అనురూప్ తెలిపారు.

?. రీసర్వే ప్రక్రియ ఎంతవరకు వచ్చింది.. ఏఏ గ్రామాల్లో చేస్తున్నారు

!. రీసర్వే ప్రక్రియ వేగంగా జరుగుతోంది. మనుబోలుతో పాటు వడ్లపూడి, మడమనూరు గ్రామాల రీసర్వే ప్రక్రియసాగుతోంది. మనుబోలు రీసర్వే ప్రస్తుతం తహసీల్దార్ లాగిన్ నుంచి ఆర్డీవోకు వెళ్ళింది.

?. చెరువుల సర్వే ఎప్పటికి పూర్తవుతుంది

!. వేగంగానే సర్వే చేస్తున్నాం. ప్రత్యేకంగా నిర్దిష్ట సమయం అంటూ ఏమీ లేదు. త్వరలో పూర్తిచేసి నివేదికలు ఇస్తాం.

?. సర్వే చేయాల్సిన చలానాలు ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి

!. నా దగ్గర ఎలాంటి పిటీషన్లు పెండింగ్ లో లేవు. సాధారణంగా రైతులు ఎఫ్ లైన్ కు, సబ్ డివిజన్‌కు చలానాలు కడుతుంటారు. ప్రస్తుతం చలానాలు పెండింగ్ లేవు.

?. రీసర్వేలో భూమి తక్కువగా చూపుతున్నారని అంటున్నారు..

!. అలాంటిదేమీ లేదు. గతంలో గొలుసుల ద్వారా భూమి కొలతలు వేసి రికార్డులలో రాసేవాళ్ళు. ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల మేరకు రోవర్లతో కొలతలు తీస్తున్నాం. రోవర్ ఎంతవరకు భూమి చూపుతుందో అదే రీ సర్వేలో నమోదు చేయిస్తున్నాం.

అన్నదాన పథకానికి రూ. లక్ష విరాళం



నగదు అందజేస్తున్న గోపాలయ్య

రాపూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి నిత్య అన్నదాన పథకానికి పొదలకూరు మండలం, చాటగొట్లకి చెందిన నలగర్ల గోపాలయ్య, లక్ష్మీదేవి దంపతులు, కుటుంబ సభ్యులు శనివారం ఆలయ సిబ్బందికి రూ. 1,00,116 విరాళం అందించారు. దాతలకు స్వామి, అమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి తీర్థ ప్రసాదాలు అందించారు.

సంగం విద్యార్థినికి గోల్డ్ మెడల్

సంగం: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఊట్ల శ్రీలత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈనెల 25, 26 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచింది.

విజ్ఞాన్‌లో ఉత్సాహంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు

పొదలకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విజ్ఞాన్ జూనియర్ కళాశాల 25 సంవత్సరాల వేడుక (సిల్వర్ జూబ్లీ)ను శనివారం స్థానిక బోగోలు కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నెల్లూరు జిల్లా ఆర్‌ఐఓ వర ప్రసాద్‌రావు, పొదలకూరు వ్యవసాయ పాలి టెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త ప్రసన్న రాజేష్, టీటీడీ విజిలెన్స్ రిటైర్డ్ డీఎస్పీ తోట ప్రభాకర్‌గౌడ్, సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు వాసిపల్లి శివారెడ్డి హాజరయ్యారు. సిల్వర్ జూబ్లీ లోగోను అతిథులు ఆవిష్కరించారు. చదువు కంటే సంస్కారం ముఖ్యమని, తల్లి దండ్రులు చదువు విషయంలో అబ్బాయిలు, అమ్మాయిలంటూ వ్యత్యాసం చూపకూడ దన్నారు. కరస్పాండెంట్ మూలంరెడ్డి సుధా కర్ రెడ్డి, యాజమాన్యం గువ్వల నారాయణ రెడ్డి, సుబ్బారెడ్డి, బోగోలు భాస్కర్‌రెడ్డి, ఎన్‌వీ రెడ్డి, అన్నం సుబ్బారావు, అకడమిక్ ఇన్‌చార్జ్ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ ఏ.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

భండాసుర వధ అలంకారంలో కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని జొన్నవాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శనివారం 'శ్రీ భండాసుర వధ' అలంకారంలో కామాక్షితాయి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేకం, నవావరణ పూజలు చేశారు. రాత్రి స్వామివారికి అభిషేకము, అమ్మవారికి కాళరాత్రి నవావరణ పూజలు చేసి కొలువులు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఆది వారం కామాక్షితాయి శ్రీ మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. స్థానిక సీతా, లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి ఆలయంలో శనివారం కోదండరాముడు 'శ్రీ వేంకటేశ్వర స్వామి' అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రామకృష్ణానగర్‌లో కొలువైన శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కళ్యాణ వేంకటేశ్వరుడు జయలక్ష్మి అలం కారంలో దర్శనమిచ్చారు. పొదలకూరు వెలుగు సీసీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భజన పాటలు, కోలాటం భక్తులను అలరించాయి.



బుచ్చి : వేంకటేశ్వరస్వామి అలంకరణలో కోదండరామస్వామి



రాపూరు : విశ్వశాంతి ఆశ్రమంలో పూజ చేస్తున్న విజయేశ్వరి దేవి

సంతానలక్ష్మి అలంకరణలో అమ్మవారు

రాపూరు : పెంచలకోన క్షేత్రంలోని అమ్మవారి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం ఆదిలక్ష్మి అమ్మవారు సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక తిరుమంజనం నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీమాతృశ్రీ విశ్వశాంతి ఆశ్రమంలో గర్భాలయంలోని దేవ తామూర్తులకు అభిషేకాలు, సుప్రభాత సేవలు నిర్వహించారు. అనంతరం వేద పారాయణం, మహారుద్రాభిషేకాలు జరిగాయి. ఆశ్రమ వ్యవస్థాపకులు విజయేశ్వరీదేవి ఆధ్వర్యంలో రామతారక హోమం, శ్రీఆంజనేయ మూల మంత్ర హోమం, మన్య సూక్త హోమం వైభవంగా నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు ఉచిత భోజన వసతి కల్పించారు.

మైనింగ్ అక్రమాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలి

●ఎమ్మెల్యే సోమిరెడ్డి



అసెంబ్లీలో మాట్లాడుతున్న సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

ముత్తుకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అక్రమ మైనింగ్ కేసుల్లో కొల్లగొట్టిన వందల కోట్ల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం రుస్తుం మైన్‌లో జరిగిన క్వార్ట్జ్ దోపిడీపై అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని రుస్తుం మైన్‌లో క్వార్ట్జ్, అక్రమ మైనింగ్ వ్యవహారాన్ని గతంలోనూ సభలో ప్రస్తావించానన్నారు. అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవడంతోపాటు మైనింగ్ లీజు రెన్యు వల్ ప్రక్రియను లీగల్‌గా చేపట్టాలని కోర్టు ఆదేశించిందన్నారు. క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ కేసులో అరెస్టయిన వారు బెయిల్‌పై బయటకు వచ్చారన్నారు. దోపిడీకి గురైన వందల కోట్ల విలువైన క్వార్ట్జ్‌కు సంబంధించిన రికవరీ మా త్రం జరగలేదన్నారు. ప్రభుత్వం ఆ దిశగా చర్య లు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. క్వార్ట్జ్ అక్రమ మైనింగ్‌లో కీలకపాత్ర పోషించి 204 రోజుల అరణ్యవాసం, అజ్ఞాతవాసం రికార్డు సృష్టించిన కాకాణికి మరో డాక్టరేట్ ఇవ్వాలన్నారు. అక్రమా ర్కులు కొల్లగొట్టిన రూ. కోట్ల ప్రజాధనం రికవరీ ఎలా జరగాలనే విషయంపై ప్రధానంగా దృష్టి సారించాలని మైనింగ్ శాఖ మంత్రిని కోరారు. రుస్తుం మైనిం గ్ లీజు రెన్యువల్ కాకుండా గత ప్రభుత్వం అడ్డుకుని కోర్టు ఉత్తర్వులను కూడా అమలు చేయలేదన్నారు. మైనింగ్ లీజు రెన్యూవల్‌కు సంబంధించి బాధితుడికి న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎమ్మెల్యే సోమిరెడ్డి పేర్కొన్నారు.

రైతుకు సబ్సిడీపై డ్రోన్ పంపిణీ



డ్రోన్ పంపిణీ చేస్తున్న అధికారులు

రాపూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వ్యవ సాయ యాంత్రీకర ణలో భాగంగా పెరుగుతున్న ఖర్చులను నియంత్రించ డానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అన్నదాతలకు ప్ర భుత్వం సాగుకు అవసర మైన యంత్ర పరికరాలను సబ్సి డీపై అందిస్తోంది. ప్రస్తుతం డ్రోన్ల సరఫరా కార్య క్రమానికి శ్రీకారం చుట్టింది. పంట పొలాల్లో క్రిమి సంహారక మందుల పిచికారీ, ఎరు వులు, విత్తనాలు చల్లడం తదితర ప నులు త్వరితగతిన పూర్తి చేసేం దుకు అధికారులు డ్రోన్లను క్షేత్ర స్థాయికి తీసుకువస్తున్నారు. వీటి ని 80 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తున్నారు. ఇందులో భాగంగా రాపూరు పట్టణానికి చెందిన రైతు సందీప్‌కు పొదలకూరు వ్యవ సాయ శాఖ ఏడీ శివనాయక్ డ్రోన్ పంపిణీ చేశారు. నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సౌజన్యం తో సబ్సిడీపై వ్యవసాయశా ఖాధి కారులు అందజేశారు.

● ఇవీ ఉపయోగాలు ...

ప్రస్తుత పరిస్థితుల్లో, పురుగు మం దులు, ఎరువులు పొలాల్లో పిచి కారీ చేయాలంటే రోజుకు ఒక మనిషికి ఎకరానికి రూ.700 వరకు చెల్లించాలి. పని పూర్తి చేయడానికి కనీసం 5గంటల సమయం పడు తుంది. పిచికారీ చేయాల్సిన స్ప్రే ఎకరానికి 200 లీటర్లు పడుతుంది. అదే పనిని డ్రోన్ ద్వారా చేయడా నికి కేవలం 4 నిమిషాలు సరిపో తుంది. దీనికి రూ.400 నుంచి రూ.500 వరకు ఖర్చవుతుంది. కేవలం 10 లీటర్ల మందు పిచికారీ చేస్తే సరిపోతుంది. ప్రస్తుత వాతా వరణ పరిస్థితుల్లో కూలీల కొరత ను అధిగమించేందుకు ఈ డ్రోన్ విధానం ఉప యోగపడుతుంది.

● రూ. 2 లక్షలకే యంత్రం...

డ్రోన్ ధర రూ. 9.80 లక్షలు కాగా, రైతు రూ.2 లక్షలు చెల్లించా ల్సి ఉంటుంది. అనంతరం ప్రభు త్వం సబ్సిడీగా రూ. 7.80లు తిరిగి ఇస్తుంది. దీంతో రైతుకు రూ.2 లక్షలకే యంత్రం లభిస్తుంది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసా య శాఖ అధికారి సోముసుందర్, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధికారులు మునిచందన, పరంధా మయ్య, రఘురామయ్య, గోపి తది తరులు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణలు తొలగించాలి



మాట్లాడుతున్న ఈస్ట్రన్ చానల్ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి

విడవలూరు, సెప్టెంబరు, 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుచ్చిరెడ్డిపాళెం - ఊటుకూరు రోడ్డులో ఆక్రమణలను తొలగించాల్సిందిగా ఆర్ అండ్ బీ అధికారులను పీఏసీఎస్ చైర్మన్ పొన్నలూరు పురంధర రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఏడాది రోడ్లు, భవనాల శాఖాధికారులు విడవలూరులో రోడ్డు ఆక్రమణలు తొలగించినప్పటికీ ఇటీవల కొంతమంది తిరిగి రోడ్డును ఇరువైపులా ఆక్రమించేశారన్నారు. ఆర్ అండ్ బీ అధికారులు వెంటనే రోడ్డు ఆక్రమణలను తొలగించాలని కోరారు. సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిందిగా ఈస్ట్రన్ ఛానల్ చైర్మన్ పాశం శ్రీహరిరెడ్డి కోరారు. ఎంపీపీ ఏకొల్లు శేషమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసీ ల్దారు చంద్రశేఖర్, ఎంపీడీఓ నగేష్ కుమారి, మండల కోఆప్టెడ్ సభ్యుడు షేక్ రఫీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

7న ప్రమాణ స్వీకారం

ఆలయ కమిటీ చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జొన్నవాడ ఆలయ కమిటీ చైర్మన్‌గా శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షి తాయి అమ్మవార్ల సేవలు చేసుకునే భాగ్యం తనకు కలగడం పూర్వ జన్మ సుకృతమేనని ఆలయ కమిటీ చైర్మన్ తిరుమూరి అశోక్ రెడ్డి అన్నారు. ఈనెల 7న ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

14 నెలలైనా సర్వే రిపోర్టు ఇవ్వడం లేదు!

కామాక్షితాయి ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వివాదస్పదంగా వున్న జొన్నవాడ ఆలయ భూమికి సంబంధించి సర్వేకి దరఖాస్తు చేసుకోగా సర్వే చేసి 14నెలలైనా సర్వే రిపోర్టు కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా రెవెన్యూ అధికారులకు ఆ ఊసే లేదని శనివారం ఆలయ ఈఓ ఏ.వెంకట శ్రీనివాసులురెడ్డి ఆంధ్రజ్యోతికి తెలిపారు. కామాక్షితాయి ఆలయ భూమి తమదంటూ కొంతమంది చదును చేయడంపై తహసీల్దారు, పోలీసులకు ఫిర్యాదు చేసి అడ్డుకున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారుల అధికారులు సర్వే రిపోర్టు ఇవ్వకపోవడంతో ఆర్డీఓ కోర్టులో కూడా కేసు వేశామని తెలిపారు. ఈ విషయంపై తహసీల్దారు అంబటి వెంకటేశ్వర్లును వివరణ కోరగా ఇప్పుడే తమ దృష్టికి వచ్చిందన్నారు. శుక్రవారం ఆ భూమిని కూడా పరిశీలించినట్లు తెలిపారు. పాత రికార్డులు పరిశీలనకు సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. వారం రోజుల్లో తేలుస్తామని ఆయన తెలిపారు.

C.R.I.M.E N.E.W.S

ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక వ్యక్తి ఆత్మహత్యాయత్నం



వైద్యశాలలో చికిత్స పొందుతున్న మాలకొండయ్య

ఆత్మకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన మలబంటి మాలకొండయ్య ఓ ఫైనాన్స్ కంపెనీలో రూ. 6 లక్షలు రుణం తీసుకున్నాడు. నాలుగేళ్ల వాయిదాలు చెల్లిస్తున్నాడు. అయితే మూడు నెలల నుంచి ఆర్థిక ఇబ్బందులతో వాయిదాలు చెల్లించలేదు. దీంతో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు వాయిదా బకాయిలు చెల్లించకపోతే ఇంటికి తాళం వేస్తామని సెల్‌ఫోన్‌లో బెదిరించారు. దీంతో మనస్థాపం చెందిన మాలకొండయ్య శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. అయితే అతని ఆరోగ్యం విషమించడంతో నెల్లూరుకు తరలించాలని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

కారు, మినీ వ్యాను ఢీ

● తప్పిన ప్రమాదం



వ్యాను ఢీకొనడంతో దెబ్బతిన్న కారు

సంగం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారును వరికోత మిషన్‌తో వెళ్తున్న మినీ వ్యాను ఢీకొన్న సంఘటన శనివారం జరిగింది. వివరాల మేరకు... ఆత్మకూరు వైపు నుంచి తెలంగాణ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఓ కారు వేగంగా నెల్లూరు వైపు వెళ్తూ సంగం రెండు కొండల మధ్య రహదారి దిగుతూ ఎదురుగా వాహనం రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వైపు నుంచి వరికోత మిషన్‌తో వస్తున్న మినీ వ్యాను కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు వెనుకవైపు ధ్వంసమైంది. అయితే కారులో ప్రయాణిస్తున్న నలుగురికి ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదు. దీంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్‌తో వాహనాలను స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపక్కకు దూసుకెళ్లిన బస్సు

● త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డుపక్కకు దూసుకెళ్లిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్ సమీపంలోని 565 జాతీయ రహదారిపై ఏపీ కాలనీ వద్ద శనివారం ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు రోడ్డుపక్కకు దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తతో త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు నుంచి ప్రకాశం జిల్లా వైపు వెళ్తున్న బస్సు ఏపీ కాలనీ వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తులో జారుకోవడంతో రోడ్డుపక్కకు దూసుకెళ్లింది. అప్రమత్తమైన డ్రైవర్ బ్రేక్ వేయడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘట నలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. జాతీయ రహదారి నిర్వహణ సంస్థ క్రేన్ సహాయంతో బస్సును రోడ్డు మీదకు చేర్చారు.

అనారోగ్యంతో వృద్ధుడి బలవన్మరణం

నెల్లూరురూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓవ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని వెల్లంటికి చెందిన రాపూరు పెద్ద అంకయ్య(84) కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధిని ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో బాధభరించలేక శుక్రవారం తన ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన కుటుంబీకులు హుటాహుటిన నెల్లూరులోని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు పద్మాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బియ్యం వ్యాపారికి ముగిసిన పోలీస్ కస్టడీ

నెల్లూరురూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైస్‌మిల్లర్లకు నగదు చెల్లించని బియ్యం వ్యాపారికి పోలీస్ కస్టడీ శనివారం ముగిసింది. విజయవాడకు చెందిన కోట వెంకట సత్యనారాయణ నెల్లూరు రూరల్‌లోని పలువురు రైస్ మిల్లర్ల వద్ద బియ్యం కొనుగోలు చేసి తిరిగి నగదు చెల్లించలేదని సీఐ గుంజి వేణు తెలిపారు. బాధిత మిల్లర్లు ఇచ్చిన ఫిర్యాదుతో ఇటీవల సత్యనారాయణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. మరింత విచారణ నిమిత్తం కోర్టు అనుమతితో శుక్రవారం పోలీసు కస్టడీకి తీసుకుని విచారించామని, విచారణ ముగియడంతో శనివారం కోర్టు ద్వారా జైలుకు తరలించినట్లు తెలిపారు.

ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో జ్ఞానశేఖర్ నివాసం ఉంటు న్నారు. శనివారం రాత్రి ఇంట్లో ఏసీ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. ఈవిషయాన్ని గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో ఇంట్లోని సీలింగ్‌కు ఉన్న పీవోపీ కాలిపోయింది.

మద్యం లేదన్నందుకు వాచ్‌మన్‌పై దాడి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైన్‌షాపుల సమయం ముగిసింది. నైట్ సేల్స్ లేదన్నందుకు ఇద్దరు వ్యక్తులు వాచ్‌మెన్‌పై బీర్ బాటిల్‌తో దాడి చేసిన ఘటన శనివారం చింతారెడ్డిపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలోని ఓ వైన్‌షాపులో జరిగింది. చింతారెడ్డిపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలోని ఓ వైన్‌షాపులో మురళి వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు స్కూటీపై షాపువద్దకు వచ్చారు. మద్యం కావాలని వాచ్‌మెన్‌ను అడుగగా నైట్‌సేల్స్ లేవని చెప్పగా వారు గొడవకు దిగారు. ఈ క్రమంలోనే రోడ్డుపై ఖాళీగా పడి ఉన్న బీరుబాటిల్‌ను తీసుకుని వాచ్‌మెన్‌పై దాడి చేశారు. గాయాలపాలైన మురళి ఈ మేరకు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236
కోడిగుడ్ల ధర (100): 550	

ఆసుపత్రుల ట్రేడ్ లైసెన్సుల రుసుం చెల్లించాలి : కమిషనర్

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రులు, క్లినిక్‌లు నిర్వహించే వైద్యులు కార్పొరేషన్‌కు చెల్లించాల్సిన ట్రేడ్ లైసెన్సుల రుసుం వెంటనే చెల్లించాలని కమిషనర్ నందన్ సూచించారు. ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ సభ్యులతో ఎన్ఎంసీలో శనివారం సమావేశమైన ఆయన ఈ మేరకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం క్షేత్ర స్థాయిలో సర్వే జరుగుతుందని, ఆ మేరకు ట్రేడ్ లేని లెక్క మరింత పక్కాగా తేలుతుందన్నారు.

రూ.36 కోట్ల వరకు ట్రేడ్ లైసెన్సు బకాయిలు రావాల్సి ఉందని చెప్పారు. అలాగే అల్లీపురం వద్ద ప్రధాన మంత్రి ఆవాస్‌యోజన 2.0 అంగీకార్ కార్యక్రమంపై అమృత పథకం డీడీ మాదిరి లబ్ధిదారులకు టిడ్కో గృహ సముదాయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

న్యూస్ బాక్స్

ఆర్ఐగా కృపాకర్

● మరో ఆర్ఐకి డివిజన్ల మార్పు

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంలో నూతన ఆర్ఐగా కృపాకర్‌కు బాధ్యతలు అప్పగించిన కమిషనర్ నందన్, మరో ఆర్ఐ శ్రావణ్‌కుమార్‌కు డివిజన్లు మార్పు చేస్తూ శనివారం ఉత్తర్వులిచ్చారు. నగరంలోని 3 నుంచి 9 డివిజన్లకు ఆర్ఐగా ఉన్న వంశీనాథ్‌రెడ్డి తన వ్యక్తిగత అభ్యర్థన మేరకు ఆర్ఐ బాధ్యతలు తప్పించిన కమిషనర్ డీసీ చెన్నుడుకు రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ఆ డివిజన్లకు ప్రస్తుతం 50-54 డివిజన్లకు ఆర్ఐగా ఉన్న సాదు శ్రావణ్‌కుమార్‌కు అప్పగించారు. ఈ డివిజన్లకు నూతనంగా బాధ్యతలు అప్పగించిన కృపాకర్‌కు కేటాయిస్తూ కమిషనర్ ఉత్తర్వులిచ్చారు. కాగా ఓ సచివాలయానికి చెందిన అడ్మిన్ తనకు ఆర్ఐగా బాధ్యతలు అప్పగించారంటూ స్నేహితులతో కేక్‌కట్ చేసిన ఘటన కార్పొరేషన్ కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది.

ప్రపంచ పర్యాటక దినోత్సవం ఊసేది?

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకంను ప్రోత్సహించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పర్యాటకంపై విస్తృత ప్రచారం చేయాలని సూచిస్తోంది. శనివారం నిర్వహించాల్సిన ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జిల్లా యంత్రాంగం విస్మరించడంతో పర్యాటక దినోత్సవం జాడే లేదు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రకటించిన ఫొటోగ్రఫీ, వీడియో రీల్స్ పోటీలను కూడా యంత్రాంగం నిరవధికంగా వాయిదా వేసింది. గొలగమూడిలోని పర్యాటక కళాశాలలో మొక్కుబడిగా పర్యాటక దినోత్సవం సదస్సు నిర్వహించి మమ అనిపించారు.

ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌లపై అవగాహన కల్పించాలి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎల్ఆర్ఎస్, బీపీఎస్ స్కీమ్‌లపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇంజనీర్ బీఎన్.రాజు ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ, అనధికార భవన నిర్మాణాలు క్రమబద్ధీకరణ ప్రయోజనాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ప్రభుత్వం అవగాహన చర్యలు కల్పించకుండా అనధికార నిర్మాణాలను కూల్చి వేస్తూ ప్రజలను ఆర్థికంగా, మానసికంగా అధికారులు వేధిస్తున్నారని తెలిపారు. నగర పాలక సంస్థ ప్రభుత్వం కల్పించిన క్రమబద్ధీకరణలకు తగినంత గడువు ఇచ్చి, భవన యజమానులకు అవగాహన కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

యూత్ వలంటీర్ల ఎంపిక కమిటీలో యశ్వంత్‌సింగ్



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబర్ 27(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నేషనల్ యూత్ క్రాఫ్ట్ పథకం కింద మై భారత్ యూత్ వలంటరీల ఎంపిక కమిటీ సభ్యుడిగా బీజేపీ నాయకుడు యశ్వంత్ సింగ్‌ను నియమించారు. ఈ సందర్భంగా యశ్వంత్ సింగ్ మాట్లాడుతూ మై యూత్ వలంటీర్ల ఎంపిక కోసం జిల్లాస్థాయి ఎంపిక కమిటీ నెల్లూరు జిల్లా సభ్యుడిగా తనను ఎంపిక చేసినందుకు ఆనందంగా ఉందన్నారు.

నేడు జాషువా జయంతి

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పద్మభూషణ్ గుర్రం జాషువా 130 వ జయంతి వేడుకలను ఆదివారం సాయంత్రం 4 గంటలకు నగరంలోని జాషువా వీధిలో ఉన్న జాషువా గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని ఆ గ్రంథాలయ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ ఖాసీం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ వైవో నందన్, విశ్రాంత ఎస్పీ కాకుమాను రాజ శిఖామణి, విద్యావేత్త లతీఫ్ కుట్టి, కుసుమకుమారి తదితరులు పాల్గొంటారని తెలిపారు.

మైపాడు బీచ్‌లో పరిశుభ్రత

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పర్యావరణ, అటవీ, వాతావరణ మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన అంతర్జాతీయ తీరప్రాంత శుభ్రపరిచే దినోత్సవాన్ని పురష్కరించుకుని మైపాడు బీచ్ శుభ్రపరిచే కార్యక్రమాన్ని శనివారం చేపట్టినట్లు కాలుష్య నియంత్రణ మండలి అధికారి అశోక్ తెలియచేశారు. కలెక్టర్ హిమాన్సు శుక్లా ఆదేశాల మేరకు జాతీయ తీరప్రాంత మిషన్ పథకం కింద ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. ఇందులో వివిధ పరిశ్రమల ప్రతినిధులు, ఎన్జీవోలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు తెలిపారు.

త్రిపుర భైరవిగా ఇరుకళల పరమేశ్వరి



అయ్యప్పగుడి గురువాయురప్పన్ ఆలయంలో సంతానలక్ష్మిగా ఆదిలక్ష్మి



మూలాపేటలో రాజరాజేశ్వరిగా దర్శనమిచ్చిన భువనేశ్వరిదేవి



స్టోన్‌హౌస్‌పేటలో ముత్యాలచీర అలంకరణలో కన్యకాపరమేశ్వరి

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు శనివారం 6వ రోజు అంబరాన్ని అంటాయి. అన్నీ ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి శ్రీత్రిపుర భైరవి అలంకారం వైభవంగా జరిగింది. ఉదయం అభిషేకాలు, ఖడ్గమాల పూజలు, పూలంగిసేవలు జరిగాయి. సాయంత్రం కుంకుమపూజలు, పల్లకీసేవలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, సభ్యులు పర్యవేక్షించారు.

● విరాట్‌నగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గోవిందమాంబ, గాయత్రిదేవీలకు మహాలక్ష్మీ అలంకారం కనుల పండువగా జరిగింది.

● బాలాజీనగర్ సీతారామమందిరంలో సీతాదేవికి పార్వతి అలంకారం జరిగింది. ఉదయం అభిషేకాలు, ధనలక్ష్మీ హోమం, సాయంత్రం కుంకుమపూజ, పూలంగి సేవ, అష్టలక్ష్మీ వైభవాలు జరిగాయి.

● మూలాపేట శ్రీకృష్ణధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదీదేవికి రాజరాజేశ్వరి అలంకారం జరిగింది. విశేష పూజలు, పూలంగిసేవలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఈవో యు.జానకమ్మ, సిబ్బంది పర్యవేక్షించారు.

● నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజుస్వామి ఆలయంలో ద్రౌపదీదేవికి లలితా పరమేశ్వరి అలంకారం జరిగింది. విశేష పూజలు, పూలంగిసేవ, పల్లకీ ఉత్సవాలు జరిగాయి.

● పప్పులవీధి మహాలక్ష్మి ఆలయంలో లక్ష్మీదేవికి లలితాదేవీ అలంకారం జరిగింది.

● పప్పులవీధి సిద్ధివిఘ్నేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి సంతానగౌరీ అలంకారం జరిగింది.

● అయ్యప్పగుడిలో గురువాయురప్పన్ మహావిష్ణు ఆలయంలో ఆదిలక్ష్మికి సంతానలక్ష్మి అలంకారం కనుల పండువగా జరిగింది. ఉదయం అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ జి.శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గద్దం రత్నయ్యలు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● **రూ.20 లక్షల నోట్లతో..**

నగరంలోని కోదండరామపురంలో మహాలక్ష్మి ఆలయంలో రూ.20 లక్షల నోట్లతో ధనలక్ష్మీ అలంకారం వైభవంగా జరిగింది. ఉదయం విశేష నవావరణ పూజలు, అష్టోత్తర సహస్ర నామ పూజలు జరిగాయి. సాయంత్రం విశేష పూజలు, పూలంగిసేవలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ పత్తి నరసింహం, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● **వేదగిరిలో విజయలక్ష్మీదేవిగా...**

నెల్లూరురూరల్ : దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేదగిరి క్షేత్రంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదిలక్ష్మి అమ్మవారు భక్తులకు విజయలక్ష్మీదేవీగా దర్శనమిచ్చారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అలచ అర్చక బృందం ఆపై దర్శనార్థం అమ్మవారిని ప్రత్యేక అలంకరణ మందిరంలో ఉంచారు.

జీఎస్టీ తగ్గింపుతో వ్యాపార రంగాల్లో పురోగతి

● టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి



దుకాణదారుడికి జీఎస్టీ ప్రయోజనాలు వివరిస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో వ్యాపార రంగాలు మరింత పుంజుకున్నాయని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. శనివారం 22వ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జీఎస్టీ తగ్గుదలపై చిరువ్యాపారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పేద, నిరుపేద, మధ్య తరగతి ప్రజలు జీఎస్టీ ప్రయోజనాలు ప్రత్యక్షంగా చూస్తున్నారని తెలిపారు. పాల ఉత్పత్తులు, హార్డువేర్, బ్యూటీప్రొడక్ట్స్, నిత్యావసరాలు వంటి 83 రకాలపై జీఎస్టీ తగ్గిందని చెప్పారు. దీని వల్ల ప్రజలకు నేరుగా లబ్ధిచేకూరుతుందని వెల్లడించారు. ఈ మేరకు వ్యాపారులు కూడా సహకరించాలని కోరారు. కేంద్రంలో ఎన్డీయే సర్కారు, రాష్ట్రంలో కూటమి పార్టీల ప్రభుత్వం వల్ల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ ప్రయోజనాలను ప్రజలు స్వయంగా తెలుసుకుని తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, జలదంకి సుధాకర్, చక్రవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు మంత్రి నారాయణ చేయూత



బాధితులకు బియ్యం, నగదు అందచేస్తున్న కమిషనర్ నందన్, సంతపేట సీఐ

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంతపేట పాత దుస్తుల మార్కెట్లో అగ్ని ప్రమాద బాధితులకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ అండగా నిలిచారు. అందులో భాగంగా శనివారం ఎన్ఎంసీ కమిషనర్ నందన్, సంతపేట సీఐ దశరథరామారావు, టీడీపీ నేత శ్రీనివాసులు ద్వారా బాధితులకు నగదు, బియ్యం, దుస్తులు అందచేశారు. మంత్రి నారాయణ ప్రకటించిన విధంగా పూర్తిగా దగ్ధమైన ఒక్కో దుకాణానికి రూ.50వేల వంతున 8 దుకాణాలకు, స్వల్పంగా దగ్ధమైన 12 షాపులకు రూ.25 వేల వంతున, పొగతో రూపురేఖలు మారిన మరో 30 దుకాణాలకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.10 లక్షల పరిహారం అందచేశారు. వీటితో పాటు స్థానిక టీడీపీ నాయకులు మరో రూ.లక్ష పరిహారం అందచేశారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున మంత్రి రాలేకపోయారని, వారి తరుపున తాము పరిహారం అందచేస్తున్నట్లు టీడీపీ నాయకులు తెలిపారు.

సీఎండీని కలిసిన విద్యుత్ శాఖ ఎస్ఈ



సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్ఈ

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన కే రాఘవేంద్రం శనివారం తిరుపతి కార్పొరేట్ ఆఫీస్‌లో దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) కే సంతోషరావును మర్యాదపూర్వకంగా కలిశారు. కష్టపడి పని చేసి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సీఎండీ సూచించారన్నారు. అలాగే చీఫ్ జనరల్ మేనేజర్ పీఎంఎం జానకిరామ్, డైరెక్టర్ ఫైనాన్స్ ఎఫ్ఏసీ రామ్ మోహన్‌లను కూడా కలిశారు. కార్యక్రమంలో నెల్లూరు టౌన్ ఈఈ ఎం.శ్రీధర్ పాల్గొన్నారు.

ఔషధాల తయారీలో ఏఐ

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మానవ వ్యాధులకు సంబంధించి కొత్త ఔషధాల తయారీలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) వల్ల విప్లవాత్మక మార్పులు వచ్చాయని తిరుపతి పద్మావతి యూనివర్శిటీ ప్రొఫెసర్ నాగరాజు, విశాఖ ఆంధ్ర యూనివర్శిటీ ప్రొఫెసర్ మురళీకృష్ణకుమార్ వెల్లడించారు. శనివారం నారాయణ ఫార్మసీ కళాశాలలో ఔషధాల తయారీలో వస్తున్న మార్పులపై వారు మాట్లాడారు. రోగానికి కారణమైన ప్రొటీన్ల నిర్మాణాన్ని అర్థం చేసుకుని వాటికి సరిపోయే మందును రూపొందించటంలో ఈ ఆర్టిఫిషియల్ ఇంటలిజెంట్స్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం నూతన సావనీర్‌ను విడుదల చేశారు. ఫార్మసీ విద్యార్థులు పరిశోధనాత్మక వ్యాసాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు, నారాయణ ఫార్మసీ కళాశాల కన్వీనర్ డాక్టర్ సుజాత, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, డైరెక్టర్ డాక్టర్ దత్తాత్రేయ శర్మ తదితరులు పాల్గొన్నారు.



జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న కేతంరెడ్డి వినోద్‌రెడ్డి

జీఎస్టీ తగ్గడంతో ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గింపుతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని టీడీపీ నేత కేతంరెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. శనివారం నవాబుపేట ప్రాంతంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆయన జీఎస్టీపై ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వినోద్‌రెడ్డి మాట్లాడుతూ జీఎస్టీ 2.0తో ప్రజలు, వ్యాపారులు చాలా సంతోషంగా ఉన్నారని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపట్టిన జీఎస్టీ సంస్కరణ దేశప్రజలకు దసరా కానుకలాంటిదన్నారు. దీని ద్వారా 83 రకాల వస్తువుల ధరలు తగ్గాయని తెలిపారు.

వక్ఫ్‌బోర్డు భూముల సర్వే



వక్ఫ్ భూములను సర్వే చేస్తున్న అధికారులు

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని పరమేశ్వరినగర్‌లో ఉన్న 13.33 ఎకరాల జామియా మసీదుకు చెందిన వక్ఫ్ స్థలాన్ని వక్ఫ్‌బోర్డు, రెవెన్యూ అధికారులు శనివారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డు అధికారులు హుస్సేన్, ఖుద్దూస్‌లు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్‌అజీజ్ ఆదేశాల మేరకు 13.33 ఎకరాల భూమి అలానే ఉందా లేదా, ఏదైనా అన్యాక్రాంతమైందా అని తెలుసుకునేందుకు సర్వే చేపట్టామన్నారు. గజం భూమి కూడా అన్యాక్రాంతం కాకుండా కాపాడడమే లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం నాయకులు జాఫర్ షరీఫ్, హయత్ బాబా, మునీర్, జవాదుల్లా ఖాన్, షకీల్, ఆదిల్, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ ప్రాంగణంలో స్వచ్ఛత హీ సేవ

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛత హీ సేవలో భాగంగా నెల్లూరు ప్రతిభా లయన్స్ క్లబ్, నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ విద్యార్థుల సహకారంతో కళాశాల ఎదురుగా ఉన్న శివాలయం ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను, గడ్డిని తొలగించారు. అలాగే దేవాలయం ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రమోహన్‌రెడ్డి, సతీష్‌కుమార్, శ్రీధర్, నరేంద్ర, నారాయణ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్య భద్రత : డీపీఎంవో డాక్టర్ రమేష్

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : దేశంలో మహిళల ఆరోగ్య భద్రత కోసం స్వస్త నారీ సశక్తి పరివార్ అభియాన్ ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి డాక్టర్ రమేష్ వెల్లడించారు. శనివారం కొత్తూరు వైఎస్సార్ నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, అర్బన్ సీడీపీవో అరుణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ కొండాపురం వెంకటేశ్వర్లు, స్వరూప, పీఎంపీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు ఏబీ చికిత్స



కుక్కకు చికిత్స చేస్తున్న వైద్యుడు మదన్‌మోహన్

నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో వీధి కుక్కల నియంత్రణకు కార్పొరేషన్ అధికారులు ప్రత్యేక ప్రణాళికతో సిద్ధమయ్యారు. నగరంలో అధికారుల లెక్కల ప్రకారం 30 వేల వీధి కుక్కలు ఉండగా దాదాపు 22 వేల కుక్కలకు ఏబీ (యాంటీ బ్రీడింగ్) చికిత్స చేశారు. తాజాగా శనివారం మరిన్ని కుక్కలను పట్టుకువచ్చి వాటికి ఏబీ వ్యాక్సిన్ వేయించారు. కాగ నగర వాసులకు ఇబ్బందికరంగా మారిన కోతులను పట్టుకుని జిల్లా సరిహద్దు ప్రాంతం బద్వేల్ వద్ద అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు అధికారులు వెల్లడించారు.

రైతులు దోపిడీకి గురికాకుండా చూడండి

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు దళారుల దోపిడీకి గురికాకుండా చూడాలని ఆర్‌పీఐ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ మాబు కోరారు. ఈ మేరకు శనివారం ఆయన జిల్లా వ్యవసాయాధికారి పీ.సత్యవాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారీ వ్యవస్థపై ఉక్కుపాదం మోపాలన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరామని, అందుకు స్పందించి ఏర్పాటు చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ ప్రధాన కార్యదర్శి పట్టపు రంగారావు, ఉపాధ్యక్షులు దుంపల సుబ్బారావు, బత్తల మధుసూదన్, నంబూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవకులకు దుస్తుల బహూకరణ



టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు చేతుల మీదుగా అర్చకులకు దుస్తులు అందచేస్తున్న వేమిరెడ్డి దంపతులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి సేవలకులైన టీటీడీ ఉద్యోగులు, అర్చకులకు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు మెంబరు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు శనివారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు చేతుల మీదుగా దుస్తులు అందచేశారు. టీటీడీ సిబ్బంది, వేదపండితులు, వాహన బేరర్స్, అర్చకులు, లడ్డూ పోటువర్కర్‌లు, కల్యాణ కట్టలో విధులు నిర్వహించే సిబ్బంది, శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొంటున్న ఇతర సిబ్బందికి వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు మాట్లాడుతూ గత 6 ఏళ్లుగా టీటీడీ ఉద్యోగులకు దుస్తులు అందజేస్తున్నామని చెప్పారు. స్వామివారికి సేవ చేసే వారికి సేవ చేయడం ఆనందంగా ఉందన్నారు. వేమిరెడ్డి దంపతులకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అభినందనలు తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ ప్రతినిధులు



కలెక్టర్ హిమాన్స్ శుక్లాను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లాను రెడ్‌క్రాస్ పాలక మండలి సభ్యులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ పాలక మండలి చైర్మన్ వాకాటి విజయకుమార్, వైస్ చైర్మన్ చామర్తి జనార్ధన్‌రాజు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు డాకారపు రవిప్రకాష్, జిల్లా కమిటీ సభ్యులు యలమూరి రంగారావు, కలికి శ్రీహరిరెడ్డి, దాసరి రాజేంద్రప్రసాద్, గుణపాటి ప్రసాద్‌రెడ్డి, రెడ్‌క్రాస్ కార్యాలయ కార్యదర్శి మస్తానయ్యలు పాల్గొన్నారు. అలాగే జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల, డీఆర్వో డాక్టర్ విజయకుమార్ లను కూడా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పెరిగిన న్యూ హోండా షైన్ 100డీఎక్స్ విక్రయం



న్యూ హోండా షైన్ బైక్‌ను నడుపుతున్న వినియోగదారుడు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీషిరిడీ షా షోరూమ్‌లో మార్కెట్‌లోకి విడుదలైన న్యూ హోండా షైన్ 100డీఎక్స్ బైక్‌లు హాట్ కేకుల్లా అమ్ముడవుతున్నాయి. జీఎస్టీ తగ్గింపుతోపాటు నేటి యువత కోరుకునే అత్యాధునిక ఫీచర్లు ఈ బైక్‌లో పొందుపరచడంతో అమ్మకాలు పెరిగాయని శ్రీషిరిడీషా హోండా మేనేజింగ్ పార్టనర్ కొండా నిరంజన్‌రెడ్డి, జనరల్ మేనేజరు మీరా మోహిద్దీన్‌లు తెలిపారు. ఈ బైక్‌తో డిజిటల్ మీటర్ ప్రీమియం క్రోమో రంగులతో పాటు ఇంజన్ 98.98 గరిష్ఠ అవుట్‌పుట్, గ్రౌండ్ క్లియరెన్స్ 168మి.మీ, ఫ్రేమ్ రకం డైమండ్ రకం, ఫ్రంట్ సస్పెషన్ టెలి స్కోపిక్, వెనుక సస్పెషన్స్ ట్విన్ (5దశల సర్దుబాటు) ఫీచర్లతో ఆకర్షిస్తోందని తెలిపారు. ఈ బైక్ రోజూ ప్రయాణం చేసేవారు, కుటుంబాలకు సరియైనదని, ప్రజలందరూ కొనుగోలు చేయాలని కోరారు.

గజలక్ష్మీ నమస్తుతే..!

వేడుకగా నవరాత్రి ఉత్సవాలు



నెల్లూరు : గజలక్ష్మిగా శ్రీరాజరాజేశ్వరి

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో దేవీ నవరాత్రి ఉత్సవాలు శనివారానికి ఆరో రోజుకి చేరాయి. అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనం ఇచ్చారు.

● నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవారికి గజలక్ష్మి అలంకారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా నవావరణ పూజలు, కన్యపూజలు, శ్రీలలితా కుంకుమార్చన, సుందరేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, కుంభహారతి నిర్వహించారు. అనంతరం సంపుటీకరణ, చండీ హోమం జరిగింది. ఉత్సవాలను ఉభయకర్తలు, అర్చకులు, సిబ్బంది, ఆలయ ఏసీ కోవూరు జనార్దన్ రెడ్డి పర్యవేక్షించారు.

● స్టోన్‌హౌస్‌పేటలో కన్యకాపరమేశ్వరికి గాయత్రి అలంకారం వైభవంగా జరిగింది. మూలవర్లకు ముత్యాలచీర అలంకారం, నవావరణ, ఖడ్గమాల, లలిత సహస్ర దీపాల అలంకరణ, భక్తులను ఆకట్టుకుంది. ఈ వేడుకలను ఉభయకర్తలు, ఆలయ పాలక మండలి చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక చైర్మన్ పేగు.షణ్ముఖరావు, కార్యదర్శి చిరంజీవి, గౌరవ సలహాదారుడు ఎంపీ.ఆంజనేయులు, కోశాధికారి జనార్దన్‌రావు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, జాయింట్ కార్యదర్శి మునగా వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

● మూలాపేట మూలస్థానేశ్వరి ఆలయంలో రా జరాజేశ్వరిగా భువనేశ్వరి అమ్మవారు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక రు ద్రాభిషేకాలు, నవావరణ పూజలు, చండీహోమం, పూలంగిసేవలు, పల్లకీసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఉభయకర్తలు, అర్చకులు, సిబ్బంది, ఈవో ఏవీ. శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



ధనలక్ష్మి అలంకరణలో కోదండరామపురం మహాలక్ష్మి





నెల్లూరు రూరల్ : విజయలక్ష్మిగా వేదగిరిలోని ఆదిలక్ష్మి



రాపూరు : సంతానలక్ష్మి అలంకరణలో అమ్మవారు





బుచ్చి : భండాసుర వధ అలంకరణలో కామాక్షితాయి

కావలి : అన్నపూర్ణాదేవిగా కలుగోళశాంభవి అమ్మవారు

భైరవులతో భద్రం గురూ!

- వీధికుక్కలతో అప్రమత్తత అవసరం
- రేబీస్ వ్యాధితో పొంచి ఉన్న ప్రాణాపాయం
- చీకటిపడితే బయటతిరగలేని పరిస్థితి
- ఈసీజన్‌లోనే సంతతి పెంపు
- నియంత్రణలో అధికారులు, పాలకుల విఫలం
- నేడు ప్రపంచ రేబీస్ వ్యతిరేక దినం



నెల్లూరు (వైద్యం) సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుక్కకాటుతో వచ్చే రేబీస్ వ్యాధితో ప్రాణాపాయం పొంచి ఉంది. వీధికుక్కల కారణంగా ఈ వ్యాధిన బారినపడి ఎందరో బాధితులు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో గత ఐదునెలల కాలంలో జిల్లాలో మూడువేలమంది కుక్కకాటుకు గురయినట్లు తెలుస్తోంది. ప్రతీ ఏటా 8వేల మందికి పైగా జిల్లాలో కుక్కకాటుకు గురవుతున్నట్లు గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఈ నేపధ్యంలో సెప్టెంబరు 28న (నేడు) ప్రపంచ రేబీస్ వ్యతిరేకదినంగా జరుపుకోవాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ణయించింది. ఈ సందర్భంగా జిల్లాలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

● **సంతతి అదుపు చేయరా..?**

జిల్లాలో గతంలో అటు మున్సిపాలిటీలు, ఇటు పంచాయతీలు ఎప్పటికప్పుడు వీధికుక్కలను పట్టుకుని, వాటిని చంపేసేవారు. ప్రస్తుతం ఈ విధానం అమలులో లేకపోవడంతో కుక్కల సంతతి విపరీతంగా పెరుగుతూ ఉంది. ఒక్క నెల్లూరులోనే 30వేలకుపైగా కుక్కలు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కుక్కలు సంతానం ఉత్పత్తి చేయకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాల్సిన మున్సిపల్ అధికారులు మొక్కుబడిగా చర్యలు చేపడతున్నారు. దీంతో అవి వేల సంఖ్యలోకి చేరుతున్నాయి. నగర కార్పొరేషన్ పరిధిలోని కనుపర్తిపాడులో కుక్కల సంరక్షణ కేంద్రం ఉన్నా, వీధికుక్కల నియంత్రణ పూర్తిస్థాయిలో జరగడంలేదు.

● **అందుబాటులో వ్యాక్సిన్ ఏదీ ?**

కుక్కకాటుకు గురైన వారికి యాంటిరేబీస్ వ్యాక్సిన్ వేయాలి. డోసుల వారీగా వేసే ఈ వ్యాక్సిన్ ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో లేదు. జిల్లాలో 52 పీహెచ్‌సీలతో పాటు 10 సీహెచ్‌సీలు ఉన్నాయి. అలాగే జిల్లా ఆసుపత్రితో పాటు రెండు ఏరియా ఆసుపత్రులు, ఒక ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఉంది. కేవలం నగరంలోని జీజీహెచ్‌లో మాత్రమే వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. దీంతో బాధితులు ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. బయట వ్యాక్సిన్ ఖరీదు రూ. 2వేల నుంచి రూ. 4 వేల వరకు ఉంది. ఇదే వ్యాక్సిన్‌ను రెడ్‌క్రాస్ ఏఆర్‌వీ సెంటర్‌లో రూ.400లకే అందుబాటులో ఉంది. నెల్లూరు రెడ్‌క్రాస్‌కు రాలేని ప్రజలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు వైద్యుల దగ్గరే చికిత్స చేయించుకుంటున్నారు.

పెరుగుతున్న బాధితులు



జీజీహెచ్‌కి ప్రతిరోజూ వచ్చే కుక్కకాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది. ఇక్కడ రోజూ 30 మంది వరకు యాంటిరేబీస్ ఇంజక్షన్‌లు వేస్తున్నాం. కుక్కకాటు బాధితులు నాలుగు ఇంజక్షన్‌లు వేసుకోవాలి. అందుకే జీజీహెచ్‌లో ప్రతిరోజూ ఈ ఇంజక్షన్‌ల కోసం వస్తుంటారు. ప్రతి ఒక్కరూ కుక్కకాటు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ గంగాధర్, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

ఆలస్యం వల్ల ఎన్నో అనర్థాలు



కుక్కకాటు బాధితులు వెంటనే వైద్య చికిత్సలు చేయించుకోకపోవడంతో ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి యాంటీరేబీస్ ఇంజక్షన్ వేసుకోవాలి. ఆలస్యం చేస్తే రేబీస్ వ్యాధికి గురికాక తప్పదు. ఇది మరణాలకు సైతం దారితీస్తుంది. ఏది ఏమైనా వీధి కుక్కలతో అప్రమత్తంగా ఉండాలి.

-డాక్టర్ సుబ్రహ్మణ్యం, ప్రభుత్వ వైద్యుడు

బాలయ్య కనుసైగ చేస్తే వైసీపీ చిల్లరగాళ్లను తరిమికొడతాం

● నుడా చైర్మన్ కోటంరెడ్డి ఆగ్రహం



మాట్లాడుతున్న కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ కనుసైగ చేస్తే అలయపై అనుచిత వాఖ్యలు చేస్తు న్న వైసీపీ చిల్లరగాళ్లను తరిమి కొడతామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి హెచ్చరించారు. శనివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడా రు. పైసాకు పనికిరాని వారంతా బాలకృష్ణను విమర్శించడం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో బాలకృష్ణ మాట్లాడిన దాంట్లో తప్పేమి ఉందని ప్రశ్నించారు. జగన్మోహన్‌రెడ్డి ఒక సైకో అని సొంత పార్టీ వారే అంతర్గత సమావేశంలో తిట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సైకో అనే పదానికి జగన్ వ ల్ల తగిన గుర్తింపు వచ్చిందన్నారు, బాలకృష్ణ మీద విమర్శలు చేసే పేర్ని నాని, కొడాలి నాని, వంశీ, గుడివాడ అమర్నాథ్‌లు ఎన్నికలకు ముందు రహస్యంగా సమావేశమైంది నిజం కాదాని, జగన్ సైకో రాజకీయం వల్ల జీవితం నాశనం అవుతుందని మాట్లాడుకున్నది వాస్తవం కాదాని ప్రశ్నించారు. బాలకృష్ణ నేరుగా ఎదురు పడితే వీరిది ప్యాంట్లు తడుపుకునే పరిస్థితి అని వాఖ్యానించారు. కానిస్టేబుల్‌ను చూసి భయపడి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి దాక్కున మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బాలకృష్ణను తిడుతున్నారన్నారు. చిరంజీవి, పవన్ కల్యాణ్ అంటే బాలకృష్ణకు ఎంతో అభిమానమని చెప్పారు. ఈ నేపథ్యంలో బాలకృష్ణ జోలికి రావద్దని, ఆయన అభిమానుల ఆగ్రహానికి తట్టుకోలేరని హెచ్చరించారు.

భక్తుల అభిప్రాయాలకే పెద్దపీట

- రూ. వంద టిక్కెట్‌పై వదంతులు నమ్మొద్దు
- కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

వలేటివారిపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చేపట్టే ఏ అభివృద్ధి కార్యక్రమమైనా, మార్పులైనా భక్తుల అభిప్రాయాలు తీసుకున్న తరువాతనే అమలు చేస్తామని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మాలకొండను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఇటీవల జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్‌ఆజాద్ ఆలయ సందర్శన అనంతరం ఆలయంలో కొన్ని మార్పులు చేయాలని సూచించారని, ఇందులో భక్తుల మనోభావాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. వంద రూపాయల టిక్కెట్ రద్దు చేశారని వస్తున్న వదంతులు అవాస్తమనని తెలిపారు. వంద రూపాయల టిక్కెట్ యథావిధిగానే కొనసాగుతుందన్నారు.. గతంలో మాదిరిగానే గర్భగుడిలో పూజలు చేసి శఠగోపం పెడుతున్నట్లు తెలిపారు. త్వరలో ఆలయానికి పాలకమండలి ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం కోసం రెండో ఘాట్‌రోడ్డు పనులు త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. మరో కల్యాణ మండపం నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ డీసీ చంద్రశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, కందుకూరు పట్టణ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, నాయకులు నార్నే రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

● **మాలకొండ ఆదాయం రూ. 12,49,537**

మాలకొండ లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుండి రూ. 12,49,537 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక దర్శనం ద్వారా రూ.4,17,000, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 2,85,075, అన్నదానం ద్వారా రూ.3,80,235, రూము అద్దెల ద్వారా రూ.34,490, కుంకుమార్చన ద్వారా రూ. 19,480, వివాహముల ద్వారా రూ. 18 వేలు ప్రధానంగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

అసంపూర్తి రోడ్లను పూర్తి చేయండి

- పక్కా ఇళ్లకు బిల్లులేవి..? ● అధికారులు సమావేశాలకు రాకుంటే ఎలా
- జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్ల క్రితం టెండర్లు పిలిచిన రోడ్లకు ఇప్పటివరకు మోక్షం లేదు. ఆ రోడ్లన్నీ గుంతలమయంగా ఉన్నాయి. వాటి గురించి పట్టించుకోండి. పక్కా ఇళ్లు నిర్మించుకోమన్నారు. బిల్లులు మాత్రం ఇవ్వలేదు. ఇలాగైతే పేదల ఇళ్లు పూర్తయ్యేది ఎలా...? జడ్పీ సమావేశానికి అధికారులు సక్రమంగా హాజరుకావడం లేదు. వారిపై చర్యలు తీసుకోండి... అని జడ్పీ స్టాండింగ్ కమిటీలో సభ్యులు అన్నారు. జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన శనివారం నగరంలోని జడ్పీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రిపాడు జడ్పీటీసీ సభ్యుడు మల్లు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణపల్లి, కంపసముద్రం, కృష్ణాపురం రోడ్డుకి గత ప్రభుత్వం రూ.4.20 కోట్లతో టెండర్లు పిలిచినా పనులు మాత్రం ఇప్పటికీ జరగలేదు. ఆ పనులు చేస్తారో.. లేదో...? తెలపాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో ప్రారంభంకానీ పనులను రద్దు చేశామని, వాటికి మళ్లీ టెండర్లు పిలిచేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపామని అధికారులు తెలిపారు. కంపసముద్రం చెరువు విస్తరణ పేరుతో కట్టలు తవ్వేశారని, దీంతో సుమారు 1000 ఎకరాలకు సాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆయన తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కలువాయి జడ్పీటీసీ సభ్యుడు బీ. అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కలువాయి ప్రాంతంలోని తెలుగు గంగ కాలువ సీతారామపల్లి,మరికొన్ని చోట్ల లీక్ అయిందని, అరికట్టాలని కోరారు. విడవలూరు జడ్పీటీసీ సభ్యుడు తుమ్మల లక్ష్మయ్య మాట్లాడుతూ పక్కా ఇళ్లకు బిల్లులు మంజూరు చేయకుండా ఆపి వేశారని, ఇలాగైతే పేదలకు ఇళ్ల నిర్మాణం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. వెంటనే బిల్లులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం అజెండాలోని ఇతర అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి వ్యవసాయశాఖ, మార్కెటింగ్, ఇరిగేషన్ శాఖ అధికారులతోపాటు తిరుపతి జిల్లా అధికారులు హాజరు కాకపోవడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ స్పందిస్తూ అధికారుల తీరు సరిగాలేదని, సమావేశం తేదీని ముందుగా తెలిపినా వారు హాజరు కాకపోవడంపై తీవ్ర అగ్రహం వ్యక్తం చేశారు. వారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి, చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవో మోహన రావును ఆమె ఆదేశించారు.

రైతుల ఆర్థిక బలోపేతానికి వేదిక ఎఫ్‌పీవోలు



మాట్లాడుతున్న ఆత్మ పీడీ మురళి

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతుల ఆర్థిక బలోపేతానికి ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీవో) వేదికలని ఆత్మ పీడీ మురళి పేర్కొన్నారు. నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో శనివారం విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్. లోకేష్‌బాబు అధ్యక్షతన ఎఫ్‌పీవోల ముఖ్య కార్యనిర్వాహకులు, డైరెక్టర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, పారదర్శక నిర్వహణ, సమష్టి నిర్ణయాలు అనుసరించడం ద్వారా ఎఫ్‌పీవోలు మరింత విజయవంతం అయ్యే అవకాశం ఉందని సూచించారు. సమష్టి వ్యాపారం, మార్కెటింగ్, విలువ ఆధారం వంటి అంశాల ద్వారా రైతులు ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. మార్కెటింగ్ వ్యూహాలు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, విలువ ఆధారం, ప్రభుత్వ పథకాల వినియోగం, ఆర్థిక వనరుల సమీకరణ వంటి పలు అంశాలపై నిపుణులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మత్స్య విభాగం శాస్త్రవేత్త హరిసాధు, శాస్త్రవేత్త సు జాత, ఆదిశంకర డీమ్డ్ యూనివర్సిటీ ఇన్క్యుబేషన్ సెం టర్ సీఈవో డాక్టర్ యోగా నరసింహ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వాహనమిత్ర పథకానికి షరతులు విధించవద్దు

● జిల్లా ఆటో కార్మిక సంఘం డిమాండ్



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఆటో కార్మికుల సంఘం నేతలు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): వాహనమిత్ర పథకానికి ఎలాంటి షరతులు విధించవద్దని జిల్లా ఆటోకార్మిక సంఘం కూటమి ప్రభుత్వాన్ని కోరింది. శనివారం నెల్లూరు నగరంలోని గాంధీ బొమ్మ సెంటర్ నుంచి వీఆర్‌సీ కూడలి వరకు ఆటోకార్మికులతో కలసి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోకార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు రాజా మాట్లాడుతూ ఆటో, మోటారు క్యాబ్, మాక్సీ క్యాబ్ ఉన్న వాహనదారులు వాహనమిత్ర కోసం ఈనెల 31వతేదీ లోపు నమోదు చేసుకోవాలన్నారు. లైసెన్స్ ఉండాలని, వాహనం రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ అయ్యి ఉండాలని, నెలలోపు పొందిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్, వాహనదారులకు ఆధార్‌కార్డుతో పాటు తెల్లరేషన్ కార్డు ఉండాలని, అద్దె వాహనదారులు ఈ పథకానికి అనర్హులని, వాహనంపై ఎటువంటి పెం డింగ్ బకాయిలు ఉండరాదని ఇలా 16 నిబంధనలు పెట్టడంతో అనేక మంది అర్హులు ఈ పథకానికి దూరమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక నగర అధ్యక్ష, కార్యదర్శులు రవీంద్ర, స్వ ర్ణబాబు, సీఐటీయూ నేతలు కత్తి శ్రీనివాసులు, సూర్యనారాయణ, శ్రీనివాసులు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశు వైద్యశాలలు ఏర్పాటు చేయాలి

● మంత్రి అచ్చెన్నాయుడుకు ఎమ్మెల్యే కాకర్ల వినతి

ఉదయగిరి : వరికుంటపాడు మండలం తూర్పురొంపిదొడ్ల, ఇతర గ్రామాల్లో పశు వైద్యశాలలు ఏర్పాటు చేయాలని శనివారం అసెంబ్లీలో రాష్ట్ర పశుసంవర్థక శాఖా మంత్రి అచ్చెన్నాయుడుకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ వినతిపత్రం అందజేశారు. మెట్ట ప్రాంతం కావడంతో అధికశాతం మంది రైతు లు పాడిపైనే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అయితే సమీపాల్లో పశు వైద్యశాలలు లేకపోవడంతో పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. స్పందించిన ఆయన తప్పకుండా అవసరమైన గ్రామాల్లో పశు వైద్యశాలల ఏర్పాటుకు చర్యలు చేప డతామన్నారు.

సామాజిక సేవకు పురస్కారం

సాధారణ కుటుంబంలో పుట్టినా, అతని ఆశయం మాత్రం ఎంతో ఉన్నతమైంది. కుటుంబ సభ్యుల ఆశలకు అనుగుణంగా విద్యలో రాణిస్తూనే తనలోని సేవా దృక్పథానికి పదును పెట్టాడు ముమ్మల పృథ్వీరాజ్. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం(వీఎస్‌యూ)లోని జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ద్వారా సేవలకు శ్రీకారం చుట్టారాయన. ఈ క్రమంలో ఆయన గత ఏడాది రాష్ట్ర అవార్డుకు, ఈఏడాది జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈనెల 29న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు.

- చదువును కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలు
- రాష్ట్రపతి అవార్డుకు పృథ్వీరాజ్ ఎంపిక
- ఈ నెల 29న ఢిల్లీలో ప్రదానం

వెంకటాచలం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం జిల్లా సెట్టూరు మండలం చిన్నంపల్లికి చెందిన ముమ్మల ఈశ్వరప్ప-రత్నమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. వారిద్దరిని విద్యతో సేవా కార్యక్రమాల్లో రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించారు. తండ్రి ఈశ్వరప్ప తాగునీటి ప్రాజెక్టులో పంపు ఆపరేటర్‌గా పనిచేస్తుండగా, తల్లి రత్నమ్మ గృహిణి. కాగా పెద్దకుమారుడు పృథ్వీరాజ్ విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు.



పృథ్వీరాజ్‌కు అభినందనలు తెలుపుతున్న వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ సునీత

● **సమాజాభ్యుదయమే ధ్యేయంగా...**

సమాజాభ్యుదయమే ధ్యేయంగా వీఎస్‌యూలోని ఎన్‌ఎస్‌ఎస్ విభాగం పనిచేస్తున్నది. ఈ క్రమంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహణలో ముందుంది. వర్సిటీ కళాశాలలో ఎంఎస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేసిన పృథ్వీరాజ్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ప్రముఖ ఫార్మా కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. ఆయన ఇంటర్, డిగ్రీ నుంచే ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా సేవా కార్యక్రమాలు శ్రీకారం చుట్టారు. వర్సిటీ కళాశాలలో ఎంఎస్సీ బయోటెక్నాలజీలో చేరిన మొదటి సంవత్సరం (2021)లోనే ఎన్‌ఎస్‌ఎస్ వలంటీరుగా చేరారు. 2023 వరకు సేవా కార్యక్రమాలు చేశారు.

● **సేవల్లో మేటి**

రక్తదానం చేయడం, మొక్కలు నాటడం, పచ్చదనం - పరిశుభ్రత, జాతీయ సమైక్యతా శిబిరం, జాతీయ యువజనోత్సవం, మహిళా సాధికారత, పర్యావరణం, నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన... ఇలా అనేక కార్యక్రమాల్లో పృథ్వీరాజ్ పాల్గొన్నారు. అంతేకాక బెంగళూరులో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపుతోపాటు కర్ణాటకలో జరిగిన నేషనల్ యూత్ ఫెస్టివల్‌లో కూడా పాల్గొన్నారు. దీంతో గత ఏడాది రాష్ట్రస్థాయి ఎన్‌ఎస్‌ఎస్ ఉత్తమ వలంటీర్ అవార్డును అందుకున్నారు. కాగా ఈ ఏడాది రాష్ట్రం నుంచి జాతీయస్థాయికి ఎంపికై పృథ్వీరాజ్ జాతీయ అవార్డును అందుకోనున్నారు. ఈ క్రమంలో రెండురోజుల కిందట వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్ తదితరులు ప్రత్యేకంగా పృథ్వీరాజ్‌ను అభినందించారు. కాగా ఈనెల 29న ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకోనున్నారు.

ఎంతో గర్వంగా ఉంది!

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌గా అందించిన సేవలు ఎంతో గుర్తింపు తెచ్చాయి. గత ఏడాది రాష్ట్రస్థాయి అవార్డు అందుకోవడం, ఈ ఏడాది రాష్ట్రపతి చేతుల అవార్డును అందుకోనుండడం ఎంతో గర్వంగా ఉంది. వీఎస్‌యూలోని ఎన్‌ఎస్‌ఎస్ విభాగంలో చేరి ఎంతో నేర్చుకున్నా. అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నా. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటాను. తల్లిదండ్రులు, అధ్యాపకుల ప్రోత్సాహంతోనే జాతీయ అవార్డు సాధించా.

- పృథ్వీరాజ్





రైతులకు అందుబాటులో యూరియా

సీతారామపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మారంరెడ్డిపల్లి సహకార సొసైటీ కార్యాలయంలో 13.5 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందని మారంరెడ్డిపల్లి సొసైటీ అధ్యక్షుడు సోమనబోయిన రాజశేఖర్ శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం నుంచి రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 10902
వెండి కిలో ధర	రూ. 147500
వెండి ఒక గ్రాము	రూ. 150.50

న్యూస్ బాక్స్

వాహనాల తనిఖీ



వాహన రికార్డులను తనిఖీ చేస్తున్న సీఐ గంగాధర్

ఆత్మకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో పట్టణంలోకి వస్తున్న వాహనాలను సీఐ గంగాధర్ శనివారం తనిఖీ చేశారు. పట్టణంలోకి అధిక లోడుతో వెళ్లే లారీలకు అనుమతి లేదు. అయితే పట్టణంలోకి వాహనాలు వస్తుండడంతో ఆయన ఆపి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వాహనాలకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

రేపటి నుంచి యూరియా పంపిణీ



రైతు సేవా కేంద్రంలో నిల్వ ఉన్న యూరియా బస్తాలు

ఉదయగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడినరవ రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం నుంచి రైతులకు యూరియా పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతుసేవా కేంద్రానికి 18టన్నుల యూరియా(400 బస్తాలు) వచ్చిందన్నారు. తిరుమలాపురం, వెంగళరావునగర్, అప్పసముద్రం రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులకు ఈ యూరియా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కావున అవసరమైన రైతులు 1బీ, ఆధార్‌కార్డుతో వస్తే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. బస్తా రూ.266.50 చొప్పున విక్రయించడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

షూటింగ్ బాల్ టోర్నమెంట్‌లో మాముడూరు విద్యార్థినుల ప్రతిభ

చేజర్ల, సెప్టంబరు 27 (ఆంధ్రజ్యోతి). రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్‌లో చేజర్ల మండలం మాముడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎమ్ ప్రణీత, 9వ తరగతి చదువుతున్న పి పల్లవి గోల్డ్‌మెడల్ సాధించినట్లు పిఈటి గురవయ్య తెలియజేశారు. ఈసందర్భంగా విద్యార్థినులను, పిఈటి గురవయ్యను పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

సంగం విద్యార్థినికి బంగారు పతకం

సంగం: రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ టోర్నమెంట్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఊట్ల శ్రీలత ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది. ఈనెల 25, 26 తేదీల్లో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించింది.



వ్యవసాయంతోపాటు వివిధ వ్యాపారాల్లో అధిక పెట్టుబడులు పెట్టినా, ఆశించిన ఫలితాలు లేకపోవడంతో రైతులు, ప్రజలు విసుగెత్తిపోయారు. ఈ నేపథ్యంలో వారు వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ పశుగణాభివృద్ధి పథకం ద్వారా 50శాతం రాయితీపై రుణాలు మంజూరు చేసి ఆర్థికంగా ప్రోత్సాహకాలు అందచేస్తున్నది. ఇందులో భాగంగా దేశవాళి జాతి కోళ్లను కొనుగోలు చేసి, వాటిని సంరక్షించుకుంటూ వ్యాపారాన్ని కొనసాగించుకొనే అవకాశం కల్పించింది. దీంతో వాటి పెంపకంపై ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

- ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)

దేశవాళి కోళ్ల పెంపకంతో ఉపాధి

● పెంపకందారులకు కేంద్రం ప్రోత్సాహం ● 50శాతం రాయితీపై రుణాలు ● ఆసక్తి చూపుతున్న ప్రజలు

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో పల్లె ప్రాంతాల్లో ప్రత్యేకంగా షెడ్లను ఏర్పాటు చేసుకొని దేశవాళి కోళ్ల పెంపకంలో నిమగ్నమవుతున్నారు. ఇలాంటి అవకాశాన్ని ఉదయగిరి నియోజకవర్గంలో తొలిసారిగా వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లికి చెందిన దేరంగుల కొండలరావు సద్వినియోగం చేసుకొని ముందుకు సాగుతున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించిన రాయితీ రుణంతో ప్రత్యేకంగా షెడ్లను ఏర్పాటు చేసుకొని, అందులో దేశవాళి జాతికి చెందిన సోనాలి రకం కోళ్లను పెంచుతూ జీవనం సాగిస్తున్నారు. ఆశించిన మేర ఫలితాలు సాధిస్తుండడంతో విషయం తెలుసుకున్న ఇతర ప్రాంతాల ప్రజలు సైతం ఆ గ్రామానికి చేరుకొని కోళ్ల పెంపకంలోని మెలకువలు తెలుసుకుంటూ వ్యాపారాలు చేసేందుకు ముందుకు వస్తున్నారు.

● రూ. 50లక్షల వరకు రుణం

దేశవాళి కోళ్ల పెంపకందారులకు కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రూ. 50 లక్షల వరకు 50శాతం రాయితీపై రుణాలు మంజూరు చేస్తున్నది. ఇందులో పెంపకం దారుడు బ్యాంకు ఖాతాలో తన వాటాగా 10శాతం నగదు జమ చేయాల్సి ఉంటుంది. అనంతరం విడతల వారీగా రుణం మంజూరైన వెంటనే రూ. 20లక్షలతో షెడ్డుల నిర్మాణం చేపట్టాలి. రూ. 6లక్షలతో కోళ్ల దాణా, మరో రూ. 6 లక్షలు పరికరాలు, మిగిలిన నగదుతో కోళ్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో పెద్దిరెడ్డిపల్లి యూనియన్ బ్యాంకు అధికారులు తొలిసారిగా రుణం మంజూరు చేసి రైతులను ప్రోత్సహిస్తున్నారు.

● ఆర్థికంగా చేయూత

అందిన రుణంతో తొలుత హైదరాబాదు నుంచి వెయ్యి కోడి పెట్టలు, మరో వంద కోడి పుంజులను కొనుగోలు చేసిన కొండలరావు వ్యాపారానికి శ్రీకారం చుట్టారు. దీంతో కోళ్లతో సహా గుడ్ల అమ్మకాలు సైతం జోరుగానే సాగుతుండడంతో ఆర్థిక చేయూత లభిస్తోంది. కిలో మాంసం రూ. 300 నుంచి 350 వరకు విక్రయిస్తుండగా, ఒక్కో గుడ్డు రూ. 5 చొప్పున ధర పలుకుతుంది. బాయిలర్, ఫారం రకం కోళ్లతో పోల్చితే రుచితోపాటు ఆరోగ్యదాయకంగా ఉంటుండడంతో వాటి కొనుగోలుకు ప్రజలు మొగ్గు చూపుతున్నారు.

మూడేళ్ల పాటు నిరంతరంగా ఒక్కో కోడి గుడ్లు పెడుతుంది. ఇప్పటికే ఆ గ్రామం నుంచి విజయవాడ, ఉదయగిరి, కందుకూరు, పామూరు వంటి పట్టణాలకు గుడ్లను విక్రయిస్తున్నారు.

● ఆన్‌లైన్‌లో దరఖాస్తు

ఆసక్తి కలిగిన ప్రజలు వచ్చే ఏడాది ఆగస్టు వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంది. అలాంటి వారు షెడ్డు నిర్మాణం కోసం రెండు ఎకరాల స్థలం కలిగి ఉండాలి. అలాగే నీటి వసతి ఏర్పాటు చేసుకోవాలి. రుణం పొందిన తరువాత కోళ్ల పెంపకాన్ని తప్పనిసరిగా రెండేళ్ల వరకు కొనసాగించాలి. విరమించుకొనే క్రమంలో సంబంధిత అధికారులకు తగిన కారణాలతో వివరాలు తెలియజేయాలి.

ఆసక్తి పెరుగుతోంది

దేశవాళి కోళ్లలో సోనాలి రకం కోళ్ల పెంపకంపై రోజు రోజుకు ఆసక్తి పెరుగుతుంది. వ్యవసాయంలో ఆశించిన ఫలితాలు లేకపోవడంతో ప్రత్యామ్నాయంగా కోళ్ల పెంపకం చేపట్టా. తన ఆసక్తిని గమనించి బ్యాంకు అధికారులు రుణం మంజూరు చేశారు. వీటి వినియోగం రుచితో పాటు ఆరోగ్యానికి మేలు చేకూరుస్తుండడంతో ప్రజలు అధికంగానే కొనుగోలు చేస్తున్నారు.

- కొండలరావు, పెంపకందారుడు

సద్వినియోగం చేసుకోవాలి

పశుసంవర్ధక శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ఆర్థికంగాభారం లేకపోవడంతో తమ సొంత స్థలంలో కుటుంబ సభ్యులే కోళ్ల పెంపకం చేపట్టి ఆర్థికంగా స్థిరపడే అవకాశం ఉంది. నాటు కోళ్ల మాదిరిగా వ్యాధులు సోకే ప్రమాదం కూడా తక్కువగానే ఉంటుంది.

- రాఘవేంద్ర, పశువైద్యాధికారి

కమనీయం.. శ్రీనివాస కల్యాణం



శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీనివాస కల్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. ఈ సందర్భంగా హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి వేద మంత్రోచ్ఛరణ నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాస కల్యాణం తిలకించిన భక్తజనులు ఆనందంతో పులకించిపోయారు. కాగా, ఉభయకర్తలు నిర్మించిన వడ్లమూడి నాగేశ్వరరావు, సరోజనమ్మ అన్నప్రసాద కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పెండ్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీతారాములకు వైభవంగా...

ఉదయగిరి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాయపాళెం పంచాయతీ వెంకట్రావుపల్లి గ్రామంలో ఉన్న కోదండరామస్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామివార్లకు విశేష పూజలు, అలంకరణలు చేపట్టి అనంతరం వేదమంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణతంతు నిర్వహించారు. భక్తులు స్వామివారికి కాయాకర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కల్యాణోత్సవం అనంతరం గ్రామపురవీధుల్లో స్వామివార్ల గ్రామోత్సవం చేపట్టారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సంగం సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

సంగం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడానికే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిందని తహసీల్దారు సోమ్లానాయక్, పీఏసీఎస్ చైర్‌పర్సన్ జి శ్రీనివాసులు యాదవ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎడగారు కింద సాగుచేసిన వరి కోతలు కోస్తున్నారు. ఈ నేపథ్యంలో రైస్‌మిల్లర్లు, దళారులు కుమ్మక్కై మద్దతు ధర కంటే తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో జిల్లాలోని సహకార సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలుచేసి మద్దతు ధర కల్పించాలని నిర్ణయం తీసుకుంది. ఈమేరకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు సంగం సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని సూచించారు. రెండు రోజులో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు బ్యాంకు గ్యారెంటీ ఉన్న రైస్‌మిల్లులను ట్యాగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం విధి విధానాలు విడుదల చేయనుందని, ఈలోపు ధాన్యం కొనుగోలు కేంద్రంలో గోనెసంచులు అందుబాటులో ఉంచుకోవాలని సొసైటీ సీఈవో దస్తగిరి సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, సొసైటీ సిబ్బంది, సొసైటీ డెరెక్టర్లు పిట్టు పట్టాభిరామిరెడ్డి, జనార్థన్‌రెడ్డి, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, సంగం నీటిసంఘం అధ్యక్షుడు షేక్ బాబు, టీడీపీ నాయకులు గునుపూడి గిరిబాబు, ఖాదర్‌బాషా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేపు సొసైటీ సర్వజన మహాసభ

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కమ్మవారిపాళెం సొసైటీ సర్వజన మహాసభ సోమవారం కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు సొసైటీ సీఈవో సీహెచ్ లోకనాథ్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి సొసైటీ పరిధిలోని రైతులు, సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

అంగరంగ వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



ఆత్మకూరు: కాశీనాయన ఆశ్రమంలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు



ఆత్మకూరు: లలితాదేవి అలంకారంలో జ్వాలాముఖి అమ్మవారు



ఆత్మకూరు: విశ్వేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు



సంగం: సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న కామాక్షిదేవి

ఆత్మకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కాశీనాయన ఆశ్రమంలో శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా కన్యకాపరమేశ్వరి ఆలయం, జ్వాలాముఖి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని ఉత్తర బలిజ వీధిలో ఉన్న జ్వాలాముఖి అమ్మవారు లలితాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో మహాలక్ష్మిదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

సంగం: స్థానిక సంగమేశ్వరాలయంలో కామాక్షిదేవి అమ్మవారు శనివారం సంతానలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉదయగిరి: పట్టణంలోని పార్వతీ పరమేశ్వర, బాలాజీనగర్, సంతానలక్ష్మీ ఆలయాల్లో అమ్మవారు భక్తులకు లలితాత్రిపురసుందరిదేవీ అలంకరణలో దర్శనమిచ్చారు.

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్): మండలంలోని తూర్పురొంపిదొడ్లలో ఉన్న మానసాదేవి అమ్మవారు శనివారం కాత్యాయని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వరికుంటపాడులోని నాగరప్పమ్మ అమ్మవారు కామాక్షిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

సీతారామపురం: మండల కేంద్రంలోని నారాయణమ్మపేట గ్రామంలో విజయ కనక దుర్గాదేవి ఆలయం, ఘటిక సిద్దేశ్వరం క్షేత్రంలోని ఇష్టకామేశ్వరీదేవి, గ్రామదేవత అంకాలమ్మ గుడి, వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయాలలో అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అంకాలమ్మగుడ్డి వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఉదయగిరిలో లలితాత్రిపురసుందరిదేవి అలంకణలో పార్వతీదేవి



తూర్పురొంపిదొడ్లలో కాత్యాయని అలంకరణలో మానసాదేవి



సీతారామపురంలో అంకాలమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

C.R.I.M.E N.E.W.S

ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక
వ్యక్తి ఆత్మహత్యా యత్నం



వైద్యశాలలో చికిత్స పొందుతున్న మాలకొండయ్య

ఆత్మకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ కంపెనీ వేధింపులు తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన మలబంటి మాలకొండయ్య ఓ ఫైనాన్స్ కంపెనీలో రూ. 6 లక్షలు రుణం తీసుకున్నాడు. నాలుగేళ్లు వాయిదాలు చెల్లిస్తున్నాడు. అయితే మూడు నెలల నుంచి ఆర్థిక ఇబ్బందులతో వాయిదాలు చెల్లించలేదు. దీంతో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు వాయిదా బకాయిలు చెల్లించకపోతే ఇంటికి తాళం వేస్తామని సెల్‌ఫోన్‌లో బెదిరించారు. దీంతో మనస్థాపం చెందిన మాలకొండయ్య శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆత్మకూరు వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతున్నాడు. అయితే అతని ఆరోగ్యం విషమించడంతో నెల్లూరుకు తరలించాలని వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయమై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

కారు, మినీ వ్యాను ఢీ

● తప్పిన ప్రమాదం



వ్యాను ఢీకొనడంతో దెబ్బతిన్న కారు

సంగం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముంబాయి జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారును వరికోత మిషన్‌తో వెళ్తున్న మినీ వ్యాను ఢీకొన్న సంఘటన శనివారం జరిగింది. వివరాల మేరకు... ఆత్మకూరు వైపు నుంచి తెలంగాణ రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఓ కారు వేగంగా నెల్లూరు వైపు వెళ్తూ సంగం రెండు కొండల మధ్య రహదారి దిగుతూ ఎదురుగా వాహనం రావడంతో డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనుక వైపు నుంచి వరికోత మిషన్‌తో వస్తున్న మినీ వ్యాను కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు వెనుకవైపు ధ్వంసమైంది. అయితే కారులో ప్రయాణిస్తున్న నలుగురికి ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదు. దీంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఎక్స్‌కవేటర్‌తో వాహనాలను స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపక్కకు దూసుకెళ్లిన బస్సు

● త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డుపక్కకు దూసుకెళ్లిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్ సమీపంలోని 565 జాతీయ రహదారిపై ఏపీ కాలనీ వద్ద శనివారం ఓ ప్రైవేటు ట్రావెల్ బస్సు రోడ్డుపక్కకు దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తతో త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలిలా ఉన్నాయి. బెంగళూరు నుంచి ప్రకాశం జిల్లా వైపు వెళ్తున్న బస్సు ఏపీ కాలనీ వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తులో జారుకోవడంతో రోడ్డుపక్కకు దూసుకెళ్లింది. అప్రమత్తమైన డ్రైవర్ బ్రేక్ వేయడంతో ప్రమాదం తప్పింది. ఈ సంఘట నలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. జాతీయ రహదారి నిర్వహణ సంస్థ క్రేన్ సహాయంతో బస్సును రోడ్డు మీదకు చేర్చారు.

అనారోగ్యంతో వృద్ధుడి బలవన్మరణం

నెల్లూరురూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓవ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని వెల్లంటికి చెందిన రాపూరు పెద్ద అంకయ్య(84) కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధిని ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో బాధభరించలేక శుక్రవారం తన ఇంట్లో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన కుటుంబీకులు హుటాహుటిన నెల్లూరులోని ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు పద్మాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బియ్యం వ్యాపారికి ముగిసిన పోలీస్ కస్టడీ

నెల్లూరురూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రైస్‌మిల్లర్లకు నగదు చెల్లించని బియ్యం వ్యాపారికి పోలీస్ కస్టడీ శనివారం ముగిసింది. విజయవాడకు చెందిన కోట వెంకట సత్యనారాయణ నెల్లూరు రూరల్‌లోని పలువురు రైస్ మిల్లర్ల వద్ద బియ్యం కొనుగోలు చేసి తిరిగి నగదు చెల్లించలేదని సీఐ గుంజి వేణు తెలిపారు. బాధిత మిల్లర్లు ఇచ్చిన ఫిర్యాదుతో ఇటీవల సత్యనారాయణను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. మరింత విచారణ నిమిత్తం కోర్టు అనుమతితో శుక్రవారం పోలీసు కస్టడీకి తీసుకుని విచారించామని, విచారణ ముగియడంతో శనివారం కోర్టు ద్వారా జైలుకు తరలించినట్లు తెలిపారు.

ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఏసీ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో జ్ఞానశేఖర్ నివాసం ఉంటున్నారు. శనివారం రాత్రి ఇంట్లో ఏసీ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. ఈవిషయాన్ని గమనించిన అపార్ట్‌మెంట్ వాసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో ఇంట్లోని సీలింగ్‌కు ఉన్న పీవోపీ కాలిపోయింది.

మద్యం లేదన్నందుకు వాచ్‌మన్‌పై దాడి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైన్‌షాపుల సమయం ముగిసింది. నైట్ సేల్స్ లేదన్నందుకు ఇద్దరు వ్యక్తులు వాచ్‌మెన్‌పై బీర్ బాటిల్‌తో దాడి చేసిన ఘటన శనివారం చింతారెడ్డిపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలోని ఓ వైన్‌షాపులో జరిగింది. చింతారెడ్డిపాలెం క్రాస్‌రోడ్డు సమీపంలోని ఓ వైన్‌షాపులో మురళి వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు స్కూటీపై షాపువద్దకు వచ్చారు. మద్యం కావాలని వాచ్‌మెన్‌ను అడుగగా నైట్‌సేల్స్ లేవని చెప్పగా వారు గొడవకు దిగారు. ఈ క్రమంలోనే రోడ్డుపై ఖాళీగా పడి ఉన్న బీరుబాటిల్‌ను తీసుకుని వాచ్‌మెన్‌పై దాడి చేశారు. గాయాలపాలైన మురళి ఈ మేరకు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సాంకేతికత ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	118
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 550

వైభవంగా అదనపు సివిల్ న్యాయాధికారి ఆకాష్, సలోమి వివాహ వేడుక

కావలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అడిషనల్ సివిల్ న్యాయాధికారి గుర్రంకొండ ఆకాష్, సలోమి వివాహ వేడుక స్థానిక వెంగళరావునగర్‌లోని వారి నివాసంలో శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. పీఎస్ఆర్ సంస్థల అధినేత పసుపులేటి సుధాకర్, సుగుణమ్మ దంపతులు వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.



జాబ్ కార్డులకు ఈకేవైసీ చేయించాలి

లింగసముద్రం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీలలోని శ్రామికులు జాబ్‌కార్డులకు ఈకేవైసీ చేయించాలని ఏపీవో షేక్ సమీర్‌బాషా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబ్‌కార్డులు ఈకేవైసీ చేయించుకున్న శ్రామికులకే భవిష్యత్తులో హాజరువేయడం జరుగుతుందని, ఫీల్డ్ అసిస్టెంట్ల ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

డాక్టర్ శివసాయి కిరణ్‌కి పరామర్శ



గీతాంజలి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న లిడ్ కాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు

ఉలవపాడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో వైద్యవృత్తి నిర్వహిస్తున్న ఉలవపాడు గ్రామానికి చెందిన డాక్టర్ బడితల శివసాయి కిరణ్ కుటుంబాన్ని లిడ్‌కాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు శనివారం పరామర్శించారు. శివసాయి కిరణ్ తల్లి బడితల గీతాంజలి అనారోగ్యంతో మరణించింది. విషయం తెలుసుకున్న ఆయన ఉలవపాడుకు చేరుకుని గీతాంజలి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రావినూతల రమేష్, తెలుగు యువత కార్యనిర్వహణ కార్యదర్శి గడ్డం నవీన్ లిడ్‌కాప్ చైర్మనతోపాటు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మాట్లాడుతున్న వైద్యాధికారి శివశిద్ధప్ప

వలేటివారిపాలెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సిలో వైద్యాధికారి శివశిద్ధప్ప ఆధ్వర్యంలో కందుకూరు సురక్ష ఆసుపత్రి వైద్యులు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వలేటివారిపాలెంతో పాటు చుట్టుపక్కల ప్రాంతీయులు తరలివచ్చారు. వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు, స్థానిక టీడీపీ నాయకులు వలేటి మధుసూధన్‌రావు, ఈఓఆర్డీ సత్యనారాయణ, సిహెచ్ఓ శివరామయ్య పాల్గొన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

బిట్రగుంట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శనివారం ముగిసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీవీఎస్ రెడ్డి తెలిపారు. టెకీబోట్ డైరెక్టర్, ఏఐ ఎక్స్పర్ట్ ఎస్ వెంకటరెడ్డి ఐదు రోజులపాటు కళాశాల అధ్యాపకులకు ఫండమెంటల్స్ మెషీన్ లెర్నింగ్ బేసిక్స్, డేటా అప్లికేషన్లు, ప్రేప్లెక్సిటీ, సిరి, జెమిని, డీప్‌సీక్, ఎడ్యుకేషన్ ఏఐ, మ్యాజిక్ స్కూల్ ఏఐ వంటి సాధనాల ఆచరణాత్మక ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల విభాగాధిపతులు, ఐక్యూ ఏసీ ఇన్‌చార్జి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లులు స్వీకరణ

కావలి రూరల్, సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులు విద్యుత్ బిల్లులు స కాలంలో చెల్లించి మెరుగైన సేవలు పొందాలని, ఆదివారం కూడా బిల్లులు చెల్లించవచ్చని ఏఈ వసంతరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారుల సౌకర్యార్థం వెంగళరావునగర్ సబ్ స్టేషన్లోని రెగ్యులర్ రెవెన్యూ కలెక్షన్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చని, ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈ కోరారు.

వీఎన్ఆర్‌పేటలో 'స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్'

బిట్రగుంట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బిట్-1, కొత్తూరు గ్రామాల్లో శనివారం 'స్వస్థనారీ- సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం నిర్వహించారు. కోవూరుపల్లి వైద్యులు రామకృష్ణ ఆధ్వర్యం లో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎం నాగేశ్వరరావు, సర్పంచు గం డూరి మంజులపాల్గొన్నారు. సీహెచ్‌వో నజీ మున్నీసా, అంగన్వాడీ సూపర్‌వైజర్ హైమవతి పౌష్టికాహార ఆవశ్యకతపై మహిళలకు అవగాహన కల్పించారు.

దేదీప్యమానంగా నవరాత్రి ఉత్సవాలు



అల్లూరు : పార్వతీ దేవి అలంకారంలో దర్శనమిస్తున్న అమ్మవారు



కావలి : అన్నపూర్ణాదేవి అలంకారంలో కనకదుర్గ అమ్మవారు



బిట్రగుంట : లలితా త్రిపురసుందరిదేవి అవతారంలో ఉన్న అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కావలి (టౌన్) సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం గ్రామదేవత కలుగోళశాంభవి అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. రాత్రి అశ్వ వాహన సేవలందుకున్నారు. శివాలయంలోని దుర్గాభ్రమరాంబ అమ్మవారు స్కంధమాత లలితా త్రిపురసుందరి అలంకారంలో కొత్తబజారులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు లలితా త్రిపురసుందరీ దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తుల కోలాటాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విష్ణు ఆలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలోను, వడ్డిపాలెంలోని కనకదుర్గా అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలోను దర్శనమిచ్చారు. భక్తులు వేలాదిగా పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

● శ్రీవారికి కల్పవృక్ష, సర్వభూపాల వాహన సేవ

బృందావనం కాలనీలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీవారు కల్పవృక్ష వాహన, సర్వభూపాల వాహన సేవలు అందుకున్నారు. ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవాల యాగ్నిక స్వామి పరాంకుశం చినవెంకటస్వామి యాగ్నికంలో టీటీడీ ఆచార వ్యవహారాలతో జరుగుతున్న బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మహిళల కోలాట ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం మోహినీ పల్లకీ ఉత్సవం, లక్ష్మీకాసుల మాల ఉత్సవం, రాత్రి గరుడ వాహన ఉత్సవం జరగనున్నాయి.

బిట్రగుంట : బోగోలు మండలంలో శరన్నవ రాత్రుల సందర్భంగా శనివారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. బోగోలు షిరిడీ సాయి బాబా మందిరంలో బొమ్మల కొలువు, లలితా త్రిపురసుందరీ దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్నారు. విశ్వనాథరావుపేట కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వరీ అమ్మవారు లలితా త్రిపురసుందరీ దేవిగా కనువిందు చేసింది.

అల్లూరు : దేవీ నవరాత్రులను పురస్కరించుకుని అల్లూరు పరిధిలోని పార్వతీ దేవి అమ్మవారి ఆలయం (దసరా దేవాలయం)లో శనివారం అమ్మవారికి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ వరుణ్ణి ప్రత్యేక రథంలో అలంకరించి గ్రామోత్సవానికి తరలించారు. ముందుగా ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించి వైభవంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి, కలుగోళమ్మ, గంగమ్మ, పోలేరమ్మ, వృక్ష పోలేరమ్మ ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్డీఎస్ స్కీంలో లోపాలు సరి చేయాలి

- నాణ్యమైన విద్యుత్ సరఫరా ప్రభుత్వ బాధ్యత
- అసెంబ్లీలో ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

అధ్యక్షా..



అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కావలి,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): 'ఆర్డీఎస్ స్కీంలోని లోపాలను సరిచేసి అందరికీ సమానంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడం ప్రభుత్వ బాధ్యత' అని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి శనివారం అసెంబ్లీలో ప్రస్తావించారు. కేంద్రప్రభుత్వం 2021-22లో ఆర్డీఎస్ పేరుతో దేశవ్యాప్తంగా విద్యుత్‌వ్యవస్థను మెరుగుపరచేందుకు రూ. 3,03,000 కోట్లు మంజూరు చేసిందన్నారు. అందులో రాష్ట్ర వాటా రూ.15,508 కోట్లు కాగా, నెల్లూరు జిల్లాకు రూ.718 కోట్లు మంజూరైందన్నారు. త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త విద్యుత్ స్తంభాలు, ఐదు లైన్ల విద్యుత్ తీగలతో గ్రామం యూనిట్‌గా ఏర్పాటు చేయాలన్నారు. అయితే గ్రామంలో కొన్ని వీధులలో ఏర్పాటు చేసి, కొన్నిచోట్ల పాత స్తంభాలు, పాత తీగలను అలాగే వదిలేశారన్నారు. దీంతో కొందరికి త్రీఫేజ్, మరికొందరికి సింగిల్ ఫేజ్ కరెంట్ అందుతుండటంతో గ్రామాల్లో విభేదాలు ఏర్పడుతున్నాయన్నారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని, అందరికీ సమానంగా విద్యుత్ సరఫరా చేయాలని స్పీకర్ ద్వారా ఎమ్మెల్యే ప్రభుత్వాన్ని కోరారు.

సమస్యల పరిష్కారం కోసం రేపు వీఆర్ఏల నిరసన

లింగసముద్రం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకుల (విఆర్ఏ)ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29వ తేదీ న కందుకూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు మండల విఆర్ఏల సంఘం అధ్యక్షుడు షేక్‌నబీ సాహెబ్ తెలిపారు. ఈమేరకు శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆర్ఐ ఎం రమణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నబీ, విఆర్ఏలు మాట్లాడుతూ కందుకూరు డివిజన్ పరిధిలోని మండలాల్లో ఖాళీగా ఉన్న నైట్ వాచ్‌మ్యాన్, అటెండరు పోస్టులు విఆర్ఏలతో భర్తీచేయాలన్నారు. అదేవిధంగా విఆర్ఏలకు పేస్కేలు, ప్రమోషన్ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఏలు బి మహేశ్వరరావు, జి దత్తుకుమార్, కె వేణుగోపాల్, సీహెచ్ నరసింహం, కె శ్రీను, కొండయ్య, షేక్ నబీసాహెబ్, సీహెచ్ జంగయ్య, ఎ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా వలేటివారిపాలెం, రాళ్లపాడు ప్రాజెక్టు రోడ్డు

లింగసముద్రం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెం నుంచి లింగసముద్రం మీదుగా రాళ్లపాడు ప్రాజెక్టు ఆర్ అండ్‌బీ రోడ్డు గుంతలమయమై అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వలేటివారిపాలెం నుంచి వెంగళాపురం, జంగంరెడ్డిపాలెం, లింగసముద్రం ప్రాజెక్టు ఆర్చి వరకు రోడ్డు గుంతలమయం కావడంతో నరక యాతన పడుతున్నామని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. ఆరు నెలల క్రితం ఈ రోడ్డుకు మరమ్మతు పనులు చేశారు. అయితే నాణ్యతగా పనులు చేయకపోవడంతో ఎక్కడి గుంతలు అక్కడే ఉండి పోయాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నాణ్యతతో రోడ్డు మరమ్మతు పనులు చేయించాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు.

మహిళలకు ఆరోగ్య భద్రత

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి) : దేశంలో మహిళల ఆరోగ్య భద్రత కోసం స్వస్త నారీ సశక్తి పరివార్ అభియాన్ ద్వారా ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి డాక్టర్ రమేష్ వెల్లడించారు. శనివారం కొత్తూరు వైఎస్సార్ నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, అర్బన్ సీడీపీవో అరుణ, కమ్యూనిటీ ఆర్గనైజర్ కొండాపురం వెంకటేశ్వర్లు, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితం... ఆపై దసరా సెలవులు!

● కిటకిటలాడుతున్న ఆర్టీసీ బస్సులు



బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

కావలి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం.. దీనికి తోడు దసరా శెలవులు కావటం తో ఆర్టీసీ బస్సులు కిటకిటలాడుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో గతంలో ఆటోలను ఆశ్రయించే మహిళలు ఉచిత ప్రయాణం కావటంతో ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేస్తున్నారు. రద్దీ పెరగడంతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ శాతం పెరిగింది. మరోవైపు ఆర్టీసీ అదనంగా బస్సుల సంఖ్యను పెంచకపోవటంతో ఉన్న బస్సుల్లోనే ప్రయాణం చేయాల్సి వస్తోంది. శనివారం మధ్యాహ్నం కావలి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం ఎదురు చూడటం కనిపించింది. రద్దీ కారణం గా గమ్యస్థానాలు చేరేందుకు ప్రయాణీకులకు ఇబ్బందులు తప్పటం లేదు. ఈ నేపథ్యంలో బస్సుల సంఖ్య పెంచాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

ఘనంగా ధ్వజ స్తంభం, నవగ్రహ ప్రతిష్ఠ



ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

కొండాపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేటలో కొలువైన శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ధ్వజస్తంభ, నవగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. గణపతిపూజ, కలశ స్థాపన, అంకురార్పణ, హోమం, యంత్రస్థాపన పూజల అనంతరం పండితులు ధ్వజ స్తంభం, నవగ్రహ ప్రతిష్ఠ, సీతారాముల కళ్యాణం నిర్వహించారు. అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రకాశంలో ఘనంగా ఫ్రెషర్స్‌డే



ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ప్రకాశం కరస్పాండెంట్ విజయ్‌శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న అధ్యాపకులు

కందుకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు ఆటపాటలు, నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు కళాశాలలో అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించుకుని ఉన్నత స్థానాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, షేక్ నూరియాషిహాబ్, మీరావలి, జి ప్రసాద్, శైలేష్‌కుమార్, రామ్‌ప్రసాద్, బాలబ్రహ్మాచారి, ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మద్రిపూడి

కందుకూరు, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): పూర్వ ప్రకాశం జిల్లా హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కందుకూరు ఆదిత్య గ్రాండ్ రెస్టారెంట్ యజమాని మద్రిపూడి శ్రీనివాసులు ఎన్నికయ్యారు. అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం శనివారం రాత్రి కందుకూరులో జరిగింది. ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి శ్రీనివాసరావు, కార్యదర్శి కె రమణ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై అధ్యక్షుడు మద్రిపూడి శ్రీనివాసరావుతో పాటు కార్యదర్శి కె నాగేశ్వరరావు, కోశాధికారి ఎం మహేష్‌లతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆతిథ్య రంగానికి నానాటికీ ఆదరణ పెరుగుతోందని, కందుకూరులో మంచి హోటల్ నిర్వహణలో ముందున్న మద్రిపూడి శ్రీను అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికవటం అభినందనీయమన్నారు. ఆయన మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిడికిటి వెంకటేశ్వర్లు, గట్టమనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



బకాసురుని వధిస్తూ...

ఎండమబ్బుల పగటివేళ బంగారు కాంతుల కల్పవక్షం ఎక్కి ఊరేగిన స్వామి.. చల్లని రాత్రి సర్వభూపాల వాహనాధీశుడై మాడవీధుల్లో విహరించాడు. బకాసుర వధ అవతారంలో దేవేరులతో కలసి ఊరేగిన స్వామిని భక్తజనం కనులారా చూసి తరించారు.

- భక్తుల సంఖ్య 3 లక్షలు దాటొచ్చని అంచనా
- శనివారం నుంచే నిండిపోయిన గ్యాలరీలు
- టీటీడీ భారీ ఏర్పాట్లు
- తిరుపతి, తిరుమలలో పార్కింగ్‌కు ఏర్పాట్లు

నేడు గరుడసేవ

తిరుమల బ్రహ్మోత్సవాలలో అత్యంత కీలక ఘట్టం నేడు. అనేక ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో పాటూ స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే వేడుక గరుడోత్సవం. ఒకవైపు వెంకన్న వేడుకను కనులారా చూడాలని తండోపతండాలుగా వస్తున్న జనం.. మరోవైపు ఏ ఆటంకం లేకుండా వాహనసేవ జరగాలని కోరుకుంటున్న టీటీడీ.. ఎండతో మబ్బులు దోబూచులాడుతున్న వేళ గరుడోత్సవానికి సకల ఏర్పాట్లు పూర్తయ్యాయి.

తిరుపతి/తిరుమల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి గరుడసేవకు 3 లక్షల మంది భక్తులు తరలివస్తారని టీటీడీ అంచనా వేస్తోంది. ఇప్పటి దాకా గరిష్ఠంగా 2.60 లక్షల నుంచీ 2.70 లక్షల మంది వరకూ గరుడసేవకు హాజరు కాగా ఈసారి గరుడ సేవ ఆదివారం రావడం, ముందురోజు శనివారం కావడంతో ఈ సంఖ్య పెరగవచ్చని భావిస్తున్నారు. దానికనుగుణంగా టీటీడీ యంత్రాంగం భారీఏర్పాట్లు చేపట్టింది.

పెరిగిన భద్రత

గరుడోత్సవంలో పోలీసు సిబ్బంది : 4500

టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ సిబ్బంది: 1600

సీసీ కెమెరాలు: 3000

29 ఉదయం దాకా బైక్‌లకు అనుమతి లేదు!

శనివారం రాత్రి 9 గంటల నుంచీ సోమవారం ఉదయం 6 గంటల దాకా తిరుపతి నుంచీ తిరుమలకు ద్విచక్ర వాహనాలను అనుమతించడం లేదు.

కొండపై 4 వేల కార్లకే అనుమతి

తిరుమలలో పార్కింగ్ సమస్య కారణంగా గరిష్ఠంగా 4 వేల వాహనాలను మాత్రమే అనుమతించనున్నారు. 2023లో 3 వేల వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించగా గతేడాది 3500 వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించారు. నేటి ఉదయం నుంచే ప్రైవేటు వాహనాలైన జీపులు,కార్లు వంటి వాటిని కొండపైకి అనుమతించే అవకాశం వుండదు. కేవలం వీఐపీలు ప్రయాణించే వాహనాలను మాత్రమే అనుమతించనున్నారు.తిరుమలలో 20చోట్ల వాహనాలపార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

తిరుపతిలో పార్కింగ్ ఇక్కడ

● కడప, శ్రీకాళహస్తి మార్గాల నుంచీ వచ్చే టూ వీలర్లు, ఫోర్ వీలర్లు ఇస్కాన్, నెహ్రూ మున్సిపల్ హైస్కూలు, భారతీయ విద్యా భవన్ గ్రౌండ్స్‌లో పార్క్ చేయడానికి ఏర్పాట్లు చేశారు. ● చిత్తూరు, పీలేరు మార్గాల నుంచీ వచ్చే టెంపో ట్రావెలర్ బస్సులు, టూరిస్టు బస్సులకు దేవలోక్ వద్ద పార్కింగ్ సదుపాయం కల్పించారు. ● మదనపల్లె, చిత్తూరుల వైపు నుంచీ వచ్చే ఫోర్ వీలర్లు, టూ వీలర్లకు భారతీయ విద్యా భవన్, నెహ్రూ మున్సిపల్ స్కూలు, ఇస్కాన్ గ్రౌండ్స్‌లో పార్కింగ్ సదుపాయం కల్పించారు. ఇవన్నీ నిండిపోతే చెర్లోపల్లి, వకుళమాత ఆలయాల వద్ద కూడా పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ● పుత్తూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు మ్యాంగో మార్కెట్ ఆవరణలో పార్కింగ్ సౌకర్యం కల్పించారు. ● మదనపల్లె, పీలేరు మార్గాల నుంచీ వచ్చే ఆర్టీసీ బస్సులు కాలూరు క్రాస్, ఆర్సీపురం క్రాస్, తనపల్లి క్రాస్, గరుడ ఫ్లైఓవర్ మీదుగా బస్టాండుకు చేరుకోవాల్సి వుంటుంది.

కొండపైకి ఆర్టీసీ బస్సులోనే వెళ్లాలి

తిరుపతి నుంచి తిరుమలకు ఆదివారం ఉదయం నుంచీ సోమవారం ఉదయం దాకా కేవలం ఆర్టీసీ బస్సులకు మాత్రమే అనుమతి వుంటుంది. గరుడసేవకు 425 ఆర్టీసీ బస్సులు నడవనున్నాయి. శనివారం రాత్రి నుంచీ సోమవారం ఉదయం దాకా 3125 ట్రిప్పులు తిరగడం ద్వారా 2.30 లక్షల మంది భక్తులను చేరవేస్తాయని అంచనా. తిరుపతి రైల్వే స్టేషన్, ప్రధాన బస్టాండు, తిరుచానూరు, ఎమ్మార్‌పల్లి, జూపార్కు, మంగళం, రేణిగుంట రైల్వే స్టేషన్‌ల నుంచీ ఆర్టీసీ బస్సులు తిరుమలకు నడుస్తాయి.

శ్రీవారిమెట్టు దారిలో నడవచ్చు

గరుడసేవ కారణంగా భక్తుల రద్దీని తట్టుకునేందుకు శ్రీవారి మెట్టు మార్గాన్ని ఆదివారం ఉదయం నుంచీ సోమవారం ఉదయం దాకా 24 గంటలూ తెరిచివుంచాలని టీటీడీ నిర్ణయించింది. సాధారణంగా ఉదయం 6 గంటల నుంచీ సాయంత్రం 6 గంటల వరకూ మాత్రమే అనుమతి ఉంటుంది.

మాడవీధుల్లో కార్నర్ పాయింట్లు

మాడవీధుల్లో గ్యాలరీల సామర్థ్యం 1.90 లక్షల మంది. ఈసారి మాడవీధుల్లోని కార్నర్ పాయింట్లుగా అన్నదానం, మేదరమిట్ట, అనంతాళ్వార్ తోట, సుపథం తదితర నాలుగు చోట్ల క్యూలైన్లను అధికారులు పొడిగించారు. రద్దీ ఏర్పడితే ఈ పాయింట్ల వద్ద అరగంట పాటు దర్శనం పొడిగిస్తే దాదపుగా అందరికీ శ్రీవారి దర్శనం లభించినట్టు అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

నిరంతరాయంగా అన్నపానీయాలు

భక్తులు శనివారం రాత్రి నుంచే మాడవీధుల్లోని గ్యాలరీల్లో బైఠాయించారు. సోమవారం ఉదయం వరకూ మాడవీధుల్లోని 190 గ్యాలరీలలో అన్న పానీయాలు నిరంతరం సరఫరా చేసేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. సాంబారు అన్నం, పెరుగన్నం, ఉప్మా, సుండలు (ఉడికించిన శెనగలు), పాలు, మజ్జిగ, తాగునీటి బాటిళ్ళు భక్తులకు అందజేయనుంది. గ్యాలరీలకు చేరువలోనే టాయిలెట్లు కూడా ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం వరకూ ఏకంగా నాలుగు లక్షల మందికి సరిపడా భోజన ఏర్పాట్లు జరుగుతున్నాయి. రోజువారీ తయారు చేసే 3 లక్షల లడ్డూలకు అదనంగా మరో లక్ష లడ్డూలు తయారు చేసి అందుబాటులో వుంచారు మరోవైపు కొండమీద తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రాన్ని కూడా 24 గంటలూ తెరిచి వుంచుతారు.



కల్యాణవేదిక వద్ద రోడ్డుపై పడుకుని ఉన్న భక్తులు



శోభాయమానం స్నపన తిరుమజనం



తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): శనివారం మధ్యాహ్నం రంగనాయక మండపంలో శ్రీవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమజనం శోభాయమానంగా నిర్వహించారు. బాదం, పిస్తా, వట్టివేరు, పసుపు కొమ్ములు, ఎండుద్రాక్షా, యాలకులు, తులసి, రోజామాలలతో పాటు ఈసారి ప్రత్యేకంగా కుంకుమ పువ్వు మాలలు, కిరీటాలతో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని అలంకరించారు.

కాశ్మీర్ కుంకుమపువ్వుతో మాలలు

కాశ్మీర్ నుంచి తీసుకువచ్చిన మూడు కేజీల కుంకుమ పువ్వుతో చెన్నైకు చెందిన నిపుణులు మాలలు, కిరీటాలు తయారు చేశారు. వీటి విలువ రూ.6 లక్షలు. అలాగే కురువేరు, తామరపువ్వులతో తయారు చేసిన మాలలుప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చెన్నైకు చెందిన రాజేంద్రన్, షణ్ముక సుందరం, బాలసుబ్రహణ్యం గత కొన్నేళ్లుగా ప్రతి స్నపన తిరుమంజనం రోజున ఎనిమిది సెట్ల మాలలు, కిరీటాలను అందస్తున్నారని గార్డెన్ సూపరిటెండెంట్ శ్రీనివాసులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రంగనాయక మండపాన్ని కూడా పలు రకాల పండ్లు, పుష్పాలతో అలంకరించారు. ఇందులో 25 వేల తామరపువ్వులు, 5 వేల కట్ రోజా పువ్వులు ఉన్నాయి.



చిత్రం: జి.గాయత్రీదేవి

దేవదేవుడినే పతిగా చేసుకున్న
గోదాదేవి



తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రతి ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపితే, ధనుర్మాసంలో మాత్రం తిరుప్పావై పఠించి అర్చిస్తారు. ముప్పయి పాశురాల తిరుప్పావై మూలద్రావిడంలో గోదాదేవి గానం చేసిన గీతాలు. శ్రీరంగంలోని పూలతోటలో విష్ణుచిత్తులకు లభించిన కుమార్తె గోదాదేవి. రోజూ పూలు కోసి మాలఅల్లి శ్రీరంగనాథుడికి ఈమె వేసేది. ఆ మాలను ముందుగా తన మెడలో ధరించి బావుందని సంతృప్తి పడిన తర్వాతే స్వామికి అలంకరించేది. ఇది అపచారమని విష్ణుచిత్తుడు భావించినా స్వామి మాత్రం ఆమె మాలతో పాటూ గోదాదేవినీ స్వీకరించాడని చెబుతారు. అందుకే గోదాదేవి పుట్టిన శ్రీవిల్లి పుత్తూరులో ఆండాళ్ అలంకరించుకున్న పూల మాలను ఏటా తిరుమలకు తీసుకువచ్చి శ్రీనివాసుడికి అలంకరిస్తారు. దేవదేవుడినే పతిగా భావించిన మహా భక్తురాలిగా గోదాదేవిని కొలుస్తారు.

కలియుగ వెంకటేశ్వరుని వాహన సేవల్లో కళా బృందాల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. శనివారంనాటి కల్పవృక్ష వాహన సేవలో కళాకారుల ప్రదర్శనలు అద్భుతంగా సాగాయి. మహారాష్ట్రకు చెందిన 111 మంది కళాకారుల డ్రమ్ము విన్యాసాలు కట్టిపడేశాయి. తెలంగాణా కళాకారుల జానపద నృత్యం, కోయ నృత్యం, ఒడిస్సా కళాకారుల దల్కాయ్, జానపద నృత్యం, గుజరాత్ కళాకారుల దాకలదుడియ, రాజస్థాన్ కళాకారుల దాండియా, ఉత్తరాఖండ్ కళాకారుల చోలియా వంటి ప్రదర్శనలు భక్తజనరంజకంగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కూచిపూడి, దశావతరాలు, చెక్కభజన, డప్పు నృత్యం, కోలాటం ఆకట్టుకున్నాయి. రాత్రి సర్వభూపాల వాహనసేవలోనూ సాంస్కృతిక ప్రదర్శనలతో భక్తులు పరవశించిపోయారు.

- తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి)

సాంస్కృతిక వైభవం



ఎటు చూసినా భక్తజనమే

● ముందురోజే గరుడోత్సవ రద్దీ



ఆక్టోపస్ వద్ద సర్వదర్శన భక్తుల రద్దీ



ఆక్టోపస్ భవనం సర్కిల్ నుంచి భక్తులను పీఏసీ5కి తరలింపు

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. గరుడ వాహనం ముందు రోజే రద్దీగా మారింది. పెరటాసి మాసం రెండో శనివారం కూడా తోడవ్వడంతో భక్తసంద్రంగా దర్శనమిస్తోంది. మధ్యాహ్నానికే మాడవీధుల గ్యాలరీలన్నీ నిండిపోయాయి. మూలవిరాట్టు దర్శనానికి వెళ్లాలంటే 3 కిలోమీటర్ల క్యూలైన్ కనిపిస్తోంది. మరోవక్క వాహనాల ఆంక్షలు అమలవుతున్నాయి. రింగురోడ్డు వరకే అనుమతిస్తున్నారు. ప్రతి వాహనాన్ని పార్కింగ్‌కు తరలిస్తున్నారు. ఆదివారం విధులు నిర్వహించాల్సిన సిబ్బందిని శనివారం రాత్రి నుంచే తీసుకున్నారు. ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ శనివారం రాత్రి తనిఖీలు చేపట్టి విధుల్లోని భద్రతాధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు.

వెంకన్న భక్తులకు వృక్షప్రసాదం



బ్రహ్మోత్సవాల్లో భక్తులకు 'వృక్షప్రసాదం' పేరుతో తులసి మొక్కలను టీటీడీ ఫారెస్టు విభాగం పంపిణీ చేస్తోంది. తమిళనాడులోని తిరుచ్చారాపల్లికి చెందిన తులసిట్రస్టు టీటీడీకి 2.50 లక్షల తులసి మొక్కలను విరాళంగా అందజేసింది. శ్రీవారి దర్శనం, వాహన దర్శనం పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణమయ్యేవారికి వీటిని రాంభగీచా, జీఎన్సీ, బాలాజీ బస్టాండ్, అక్టోపస్ భవనం సర్కిల్ ప్రాంతాల్లో అందజేస్తున్నారు. రోజుకు 25 వేల చొప్పున ఇప్పటికే 75 వేల మొక్కలను పంచారు.

తిరుమల చేరిన గోదాదేవి మాలలు





గరుడ సేవలో ఆదివారం శ్రీవారికి అలంకరించడానికి తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుంచి గోదాదేవి మాలలు తిరుమలకు చేరుకున్నాయి. బేడి ఆంజనేయ స్వామి ఆలయం వద్దగల పెద్దజీయర్ మఠంలో ఈ మాలలకు పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. తిరుమాడవీధులలో ఊరేగింపుగా శ్రీవారి ఆలయంలోకి తీసుకెళ్లారు. శ్రీవిల్లిపుత్తూరులో గోదాదేవికి ధరింపజేసిన మాలలను గరుడ సేవలో శ్రీవారికి అలంకరించడం ఆనవాయితీ. శ్రీవల్లిపుత్తూరుకు చెందిన రెండు కుటుంబాల పూల తయారీదారులు ఈ మాలలు సమర్పిస్తున్నారు. తమిళనాడు దేవదాయశాఖ జాయింట్ సెక్రటరీ మారియప్పన్, ఈవో చక్కరై అమ్మాళ్, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, శ్రీవిల్లి పుత్తూరు ఆలయ స్థానాచార్యులు రమేష్ రంగరాజన్ పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

బ్రహ్మోత్సవాలలో నేడు	ఉదయం: 8-10మధ్య మోహినీ అవతారం రాత్రి: 6.30 నుంచి గరుడసేవ

అధ్యక్షా..

ఆర్‌వోబీ నిర్మాణం పూర్తి చేయాలి



గూడూరు పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ఆర్‌వోబీని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఒకటో, రెండో పట్టణాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా రైల్వే ట్రాక్‌పై ఆర్‌వోబీ నిర్మాణం 14 ఏళ్ల క్రితం ప్రారంభమైంది.పనులు పూర్తి కాకుండా అసంపూర్తిగా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్‌వోబీ పూర్తయితే పట్టణవాసులతో పాటు గ్రామీణ ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

- పాశిం సునీల్‌కుమార్, గూడూరు ఎమ్మెల్యే

కాళంగి నదిపై వంతెనను పునర్నిర్మించాలి



సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలో కాళంగినదిపై వంతెనను పునర్నిర్మించాలి. 1930 నాటి ఈ వంతెన శిథిలావస్థకు చేరుకోడంతో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. అటు శ్రీహరికోట, ఇటు పులికాట్ సరస్సుకు ఈ వంతెనపైనే వెళ్లాలి. గత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు నాలుగు నెలల ముందు హడావుడిగా వంతెన నిర్మాణానికి అనుమతివ్వడంతో పాటు నిధులను కేటాయిస్తున్నట్లుగా ప్రకటించి చేతులు దులుపుకుంది. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి వంతెనను పునర్నిర్మించాలి

- శాసనసభలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

గూడూరును జిల్లాగా ప్రకటించాలి



గూడూరును జిల్లాగా ప్రకటించాలి. జిల్లాగా కేంద్రంగా ప్రకటించేందుకు అవసరమైన అన్ని వనరులు పట్టణంలో ఉన్నాయి. జిల్లాగా ఏర్పాటు చేయలేని పక్షంలో గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలిపేలా చర్యలు తీసుకోవాలి.

- శాసన మండలిలో ఎమ్మెల్సీ బల్లి కల్యాణ్‌చక్రవర్తి

ఐఐటీలో నిర్మాణాలకు రూ.1250 కోట్లు

● మొదటి విడత ఫేజ్ బీ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ



ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, కలెక్టర్ తదితరులు

ఏర్పేడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో రూ.1250 కోట్లతో మొదటి విడత 'ఫేజ్ బీ' నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా 8 ఐఐటీలలో రూ.11 వేలతో చేపట్టే అభివృద్ధి పనులకు శనివారం ఒడిశాలోని జార్సిగూడ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ పనులను నాలుగేళ్లలో పూర్తి చేయనున్నారు. తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ, ఇది భవనాల నిర్మాణమే కాదని, యువత ఉజ్వల భవిష్యత్తు నిర్మాణమన్నారు. మామిడి, టమోటా రైతులకు ఉపయోగపడేలా ఆహార ప్రాసెస్‌రంగంపైనా ఐఐటీ దృష్టి సారించడం వ్యవసాయ రంగానికి శుభపరిణామమన్నారు. ఈ ఫేజ్ బిలో మూడు అకాడమిక్స్ బ్లాక్స్, ఒక మెగా ఇండోర్ ఆడిటోరియం, ఒక ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం, రెసిడెన్షియల్, స్పోర్ట్స్ విభాగ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. ఇవి విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పరిశోధనలకు ఎంతో ఉపయోగంగా ఉంటాయని చెప్పారు. డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ నాయకత్వంలో సమాజానికి ఈ ఐఐటీ పెద్ద ముందడుగు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీడబ్ల్యూడీ ప్రాజెక్టు ఇన్‌ఛార్జి, చీఫ్ ఇంజనీర్ కం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీఎస్ రెడ్డి, ఇన్‌ఛార్జి డైరెక్టర్ మురళీకృష్ణ, రిజిస్ట్రార్ కృష్ణ మోహన్, డీన్లు, ఫ్యాకల్టీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'పర్యాటకం'లో జిల్లాకు మరోసారి అవార్డు

● సీఎం చంద్రబాబు నుంచి పురస్కారం అందుకున్న కలెక్టర్



సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లాగా తిరుపతిని గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండోసారి అవార్డుకు ఎంపిక చేసింది. విజయవాడ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'బెస్ట్ డిస్ట్రిక్ట్ ప్రమోటింగ్ టూరిజం ఇన్ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం చంద్రబబు నుంచి అవార్డు అందుకున్నారు. వారసత్వ, ఆధ్యాత్మిక కళలు, కోస్టల్ అగ్రి, స్పేస్ టూరిజం అభివృద్ధికి కలెక్టర్ విశేషమైన కృషి చేశారు. అలాగే ఇంటర్నేషనల్ యోగా డే, కృష్ణవేణి సంగీత నీరాజనం, హర్ గర్ తిరంగా, ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. సీఎంతో పాటు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కలెక్టర్‌ను, జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ప్రభుత్వం, టూరిజం అథారిటీ, స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకుంటూ పర్యాటకులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ చెప్పారు. కాగా, ఉత్తమ రిసార్ట్‌గా మాంగో రిసార్ట్ శ్రీసిటీ, ఉత్తమ స్టార్ హోటల్‌గా మారస సరోవర్, ఉత్తమ చెఫ్‌గా భారతీరాజా తాజ్ హోటల్, ఉత్తమ టూరిస్టు డెస్టినేషన్ అర్బన్, రూరల్‌కు సంబంధించిన తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, బెస్ట్ డిస్ట్రిక్ట్ ప్రమోటింగ్ టూరిజం(కలెక్టర్) జిల్లా కలెక్టర్, బెస్ట్ టూరిజం ఫ్రెండ్లీ ఎయిర్‌పోర్టు తిరుపతి ఎయిర్‌పోర్టు, బెస్ట్ టూరిజం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌గా ఇండియర్ కలినరీ ఇన్‌స్టిట్యూట్(తిరుపతి), ఆర్ట్ అండ్ కల్చర్ కింద శ్రీకాళహస్తికి చెందిన దశరధాచారికి అవార్డులు లభించాయి.

అధికారులూ.. శభాష్

● మహిళా సాధికారత సదస్సు విజయవంతంపై యంత్రాంగానికి స్పీకర్ ప్రశంసలు



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి వేదికగా ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన మహిళా సాధికారత సదస్సును విజయవంతం చేసిన జిల్లా యంత్రాంగాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశంసించారు. శనివారం అసెంబ్లీ వేదికగా ఆయన అభినందనలు తెలిపారు. సదస్సు ప్రారంభం నుంచి చివరి వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చక్కటి ఏర్పాట్లతో సదస్సును విజయవంతంచేసి రాష్ట్రానికి మంచిపేరు తీసుకువచ్చారని అధికారులను అభినందించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డితోపాటు పలువురు ప్రజాప్రతినిధుల సహకారం మరువలేనిదన్నారు.





చెన్నై గొడుగులు వచ్చేశాయ్

తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): చెన్నై గొడుగులు కూడా తిరుమలకు చేరుకున్నాయి. టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు హిందూ ధర్మార్థ సమితి ట్రస్టీ ఆర్ఆర్ గోపాల్‌జీ వీటిని అందించారు. వరుసగా 21వ సారి శ్రీనివాసునికి గొడుగులను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, ప్రశాంతి, కృష్ణమూర్తి వైద్యనాథన్ తదితరులు పాల్గొన్నారు.

మాడవీధిలో చిన్నారికి అస్వస్థత



బాలికను ఎత్తుకుని పరుగులు తీస్తున్న భద్రతాసిబ్బంది

శ్రీవారి ఆలయ మాడవీధుల్లో శనివారం రాత్రి పదేళ్ల బాలిక తీవ్ర అస్వస్థతకు గురైంది. చిన్నజీయర్ మఠానికి సమీపంలోని గ్యాలరీ నుంచి సర్వభూపాల వాహనసేవను వీక్షిస్తున్న క్రమంలో ఆమె మూర్ఛవ్యాధితో కుప్పకూలిపోయింది. నోటి నుంచి రక్తం రావడంతో బాలిక తల్లిదండ్రులు రోదిస్తూ సమీపంలో భద్రతాసిబ్బంది సాయం కోరారు. వారు వెంటనే బాలికను ఎత్తుకుని వాహనం ఎదురుగా పరుగులు తీశారు. భారీ రద్దీ క్రమంలో గేట్లు తాళం వేయడంతో తిరిగి మ్యూజియం వైపునకు వేగంగా వేసుకున్న అక్కడున్న అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రికి తరలించారు. మూర్ఛవల్ల నాలుక కొరుక్కోవడంతో నోటి వెంట రక్తం వచ్చిందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం బాలిక కోలుకుంటుంది.

సర్వభూపాలంపై స్వామివారు

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి జరిగిన సర్వభూపాల వాహనంపై బకాసురవధ అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి భక్తులను దర్శనమిచ్చారు. గజరాజులు, అశ్వాలు, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల గోష్ఠి ముందు సాగుతుండగా గోవిందుడు తన వైభవాన్ని చూపారు.

ఘటాటోపంలో వాహనసేవ : ఉదయం ఓ మోస్తరుగా ఎండ కనిపించినప్పటికీ ఆ తర్వాత నల్లటి మేఘాలు తిరుమలను కప్పేశాయి. రాత్రి వరకు చల్లటిగాలులు వీయగా, రాత్రి 8.45 గంటల సమయంలో కొద్ది సేపు చిరుజల్లులు కురిశాయి. దీంతో ఉత్సవమూర్తులు తడిచిపోకుండా ఘటాటోపం నీడలో వాహనసేవను నిర్వహించారు. చినుకులు ఆగిపోవడంతో యాదావిధిగా ఘటాటోపాన్ని తొలగించి వాహనసేవను నిర్వహించారు.


మోహినిదేవి అలంకారంలో పార్వతీదేవి


బాలత్రిపురసుందరిగా కన్యకాపరమేశ్వరి


అమ్మవారి చెంతకు పూర్ణాహుతని తీసుకెళ్తున్న ఉభయకర్తలు చిట్టెటి పెరుమాల్ దంపతులు


నాయుడుపేట: అన్నపూర్ణదేవి అలంకరణలో మూకాంబికాదేవి

కరుణించవమ్మా తల్లీ...

సూళ్లూరుపేట, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రి వేడుకల్లో భాగంగా శనివారం సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి బాలత్రిపురసుందరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బాపూజీకాలనీ, సోనియాగాంధీ నగర్, కసారెడ్డిపాలెంవాసులు అమ్మవారికి సారె సమర్పించారు. అలంకరణకు శ్రీసిటీ ఎండీ రవి సన్నారెడ్డి, మమత, చండీ యాగానికి చిట్టేటి పెరుమాల్, గోవిందమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అలాగే నాగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు మోహినిదేవిగా, కన్యకాపరమేశ్వరి అమ్మవారు బాలత్రిపుసుందరిగా దర్శనమిచ్చారు.


నాయుడుపేట: పట్టణంలోని మూకాంబికాదేవి, పోలేరమ్మ, మానసాదేవి, కన్యకా పరమేశ్వరి, దుర్గాదేవి, అంకమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూకాంబికా దేవిని అన్నపూర్ణదేవిగా అలంకరించారు.

గూడూరు: స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయ దుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారిని లలితత్రిపురసుందరీ దేవి అలంకారంలో, బజారుకలిశం వద్ద అమ్మవారిని రాజ రాజేశ్వరిదేవిగా, రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారిని లలితాదేవిగా, కన్యకాపరమేశ్వరిని గజలక్ష్మీదేవిగా, ధర్మరాజ స్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని మధుకైటభవధ అలంకారంలో, నారాయణమ్మ ఆలయంలో అమ్మవారిని గాయత్రి దేవిగా, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని విజయలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మను మహాలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారిని అర్ధరథంపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని సంతానలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని మహాలక్ష్మిగా, మూలవిరాట్‌కు వారాహిదేవి అలంకరణ, కర్ణకమ్మ వీధిలోని కాత్యాయనీదేవికి మీనాక్షీదేవి అలంకారం, వెంకటేశ్వరస్వామికి పరశురామావతారం, మంద నాంచరేశ్వరికి లక్ష్మీదేవిగా అలంకరించారు.

కోట: గ్రామదేవత కోటమ్మను లలితాత్రిపురసుందరిగా, వాసవీ కన్యకాపరమేశ్వరిని అన్నపూర్ణదేవిగా, విద్యానగర్ లోని మహాలక్ష్మిని లలితాదేవిగా, గూడలిలోని చాముండేశ్వరిని లలిత త్రిపురసుందరిగా అలంకరించారు.


బాలత్రిపురసుందరీదేవిగా విజయదుర్గాదేవి


గాయత్రిదేవిగా నారాయణమ్మ


లలితాదేవిగా రాజరాజేశ్వరీదేవి


మహాలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి


మీనాక్షీదేవిగా కాత్యాయనీదేవి


లలిత త్రిపురసుందరిగా చాముండేశ్వరి


అన్నపూర్ణదేవిగా వాసవీ కన్యకాపరమేశ్వరి

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి: పాశం


సీఎం చంద్రబాబుకు సమస్యలను విన్నవిస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరారు. శనివారం సచివాలయంలో సీఎంను కలిసిన ఎమ్మెల్యే గత టీడీపీ హయాంలో పంబలేరు వంతెన నిర్మాణం ప్రారంభిస్తే వైసీపీ ప్రభుత్వం అసంపూర్తిగా నిలిపివేసిందన్నారు. రూ.9 కోట్లు మంజూరు చేయించి వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వాకాడు, కోట మండలాల ప్రజల సాగు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు కండలేరు డ్యామ్‌నుంచి 2 టీఎంసీల నీటిని స్వర్ణముఖి బ్యారేజీకి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే సునీల్ కుమార్ తెలిపారు.

చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి వెంకటనాగపవన్

గూడూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, పేదరిక నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు రాజేష్, టీవీ. సులోచనారాణి, న్యాయవాదులు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం

గూడూరు అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కన్యకా పరమేశ్వరి అమ్మవారిని విజయలక్ష్మీ దేవిగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు గ్రామోత్సవం సాగింది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు: బీజేపీ


సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్రరెడ్డి

పెళ్లకూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బంగారంపేట సచివాలయంలో నిర్వహించిన స్వస్థనారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జీఎస్టీ 2.0 సంస్కరణలతో నిత్యావసర సరుకులతో పాటు దుస్తులు, మందులు, కిరాణా సామగ్రి, వ్యవసాయ పరికరాలు, ఆటో మొబైల్స్ తదితర 375 రకాల వస్తువుల ధరలు తగ్గుతాయన్నారు. దీంతో ప్రజల కొనుగోలు శక్తి పెరగడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ పుంజుకుటుందన్నారు. జీఎస్టీ సంస్కరణలతో కలిగే లాభాలు ప్రతి కుటుంబానికి చేరేందుకు ఈనెల 22నుంచి వచ్చే నెల 25 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ నేత, బంగారంపేట సర్పంచు దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దొమ్మరాజు సత్యనారాయణరాజు, గుంటపూడి గురవయ్య, గోగుతోటి మురళి, సకిలాల సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను అడ్డుకున్న అధికారులు

కోట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాత మార్కెట్ సెంటర్‌లో కోట్లాది రూపాయలు విలువ చేసే ఇరిగేషన్ భూముల్లో అక్రమ కట్టడాలను శనివారం అధికారులు అడ్డుకున్నారు. పాత మార్కెట్ స్థలంలో ఉన్న దుకాణాలను గత ప్రభుత్వంలో అప్పటి ఆర్డీవో కిరణ్‌కుమార్ ఆక్రమణల పేరుతో తొలగించారు. కొంత మంది ఆ భూమిలో అక్ర మ నిర్మాణం చేపట్టారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు తహసీల్దారు జయజయరావు, ఇరిగేషన్ ఏఈ మునిరత్నం, మండల సర్వేయర్ గోపిరెడ్డి, ఆర్ఐ ప్రసాద్, వీఆర్వో రమణయ్య సంఘటనా స్థలానికి చేరుకొని నిర్మాణాన్ని ఆపివేయించారు.

పంచాయతీ విభజనపై గ్రామసభ

బాలాయపల్లి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరిమిడి పంచాయతీ పరిధిలో గల మేల్చూరు, సీసీ కండ్రిగ గ్రామాలను పంచాయతీగా చేయాలన్న స్థానికుల వినతి మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం సర్పంచ్ పూడేటి వనమ్మ అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి ఆర్ముగం గ్రామసభ నిర్వహించారు. ప్రజల అభిప్రాయాలను కోరుతూ ఓటింగ్ నిర్వహించగా వార్డు సభ్యులతో పాటు గ్రామసభకు హాజరైన స్థానికులందరూ అంగీకారం తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లబోతుల మురళి, రాపూరు శ్రీనివాసులు, కాసరం పెద్దశ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.